ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

3

పార్వతీపురం మన్యం

జిల్లా వార్తలు

శనివారం 31 మే 2025



యోగాతో ప్రయోజనాలెన్నో: డీఎంహెచ్‌వో

పార్వతీపురం, మే30(ఆంధ్రజ్యోతి): యోగాతో ఆరోగ్య ప్రయోజనాలెన్నో పొందొచ్చని డీఎంహెచ్‌వో ఎస్.భాస్కరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో శనివారం పార్వతీపురంలో లయన్స్ క్లబ్‌లో, సాలూరు ఇండోర్ స్టేడియంలో, పాలకొండలోని గాయత్రి కల్యాణ మండపంలో యోగాంధ్ర నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఉదయం ఏడు గంటల నుంచి 9 గంటల వరకు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. యోగాతో కలిగే ఆరోగ్య ప్రయోజనాలు, శారీరక, మానసిక ఉల్లాసం, ఒత్తిడి జయించడం వంటి అంశా లపై ప్రజలకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు.

పర్యవేక్షణ లేదు.. నిర్వహణ నిల్!



నాగావళి ప్రాజెక్టులో గుర్రపు డెక్కతో నిండిన నూతన కుడి ప్రధాన కాలువ

- అధ్వానంగా ప్రధాన సాగునీటి ప్రాజెక్టులు
- దయనీయ స్థితిలో కాలువలు
- కబ్జాలకు గురై బలహీనపడుతున్న గట్లు
- లస్కర్లు, ఇతర సిబ్బంది లేక ఇబ్బందులు
- గత వైసీపీ తీరుతో అటకెక్కిన పనులు
- ప్రభుత్వం స్పందించాలని రైతుల వేడుకోలు

జియ్యమ్మవలస, మే 30 (ఆంధ్రజ్యోతి)

జిల్లాలో ప్రధాన సాగునీటి ప్రాజెక్టుల పరిస్థితి దయనీయంగా మారింది. లస్కర్లు, ఇతర సిబ్బంది లేక వాటి నిర్వహణ ప్రశ్నార్థకంగా మారింది. ఇంజనీర్లే అన్నీ తామై చూసు కోవాల్సిన దుస్థితి ఏర్పడింది. మరోవైపు కాలువలపై పర్యవేక్షణ కూడా కొరవడింది. ప్రాజెక్టుల ద్వారా శివారు భూములకు నీరందడం లేదు. చాలాచోట్ల కాలువ గట్లు కూడా బలహీనమవగా.. మరికొన్నిచోట్ల కబ్జా లకు గురవుతున్నాయి.

నిధులు మంజూరైనా..

ప్రాజెక్టుల ఆధునికీకరణకు జైకా నిధులు మంజూరైనా.. వైసీపీ ప్రభుత్వ పుణ్యమా అని పనులు అటకెక్కాయి. కూటమి ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంతో కలిసి సబ్ డిజాస్టర్ మిటిగేషన్ ఫండ్ (ఎస్‌డీఎంఎఫ్) మంజూరు చేసింది. ప్రాజెక్టుల పరిధిలో హై ప్రయారిటీ వర్క్స్ చేయాలని నీటి పారుదలశాఖకు ఆదేశించింది. ఈ మేరకు గడువు ఇచ్చినా ఆ పనులు కూడా చేయని పరిస్థితి ఏర్పడింది. మరికొన్ని ప్రాజెక్టులకు గడువు ఇంకా ఉంది. ఆధునికీకరణ పనులు, హై ప్రయారిటీ వర్క్స్ పరిస్థితి ఇలా ఉంటే పూర్తిస్థాయిలో సిబ్బంది లేక ప్రాజెక్టుల నిర్వహణ పరిస్థితి మరింత అధ్వానంగా తయారైంది.

ఇదీ పరిస్థితి..

జిల్లాలో మేజర్ ఇరిగేషన్ ప్రాజెక్టు తోటపల్లి, మీడియం ఇరిగేషన్ ప్రాజెక్టుల్లో జంఝావతి, వెంగళరాయసాగర్, పెద్దగెడ్డ, పెదంకలాం, వట్టిగెడ్డ ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా 1,46,994.47 ఎకరాలకు సాగునీరందేలా వాటి నిర్మాణం చేపట్టారు. అయితే ప్రాజెక్టులతో పాటు కాలువలపై పర్యవేక్షణ కొరవడింది. గత వైసీపీ ప్రభుత్వం వాటి నిర్వహణను పూర్తిగా గాలికొదిలేసింది. దీంతో శివారు భూములకు సాగునీరందడం లేదు.

తోటపల్లి ప్రాజెక్టు..

జిల్లా పరిధిలో మేజర్ ఇరిగేషన్ ప్రాజెక్టు ఇది. దీని ద్వారా 62,921 ఎకరాలకు (మిగతా 6వ పేజీలో..)

ప్రాజెక్టుల నిర్వహణకు నిబంధనలు..

● ప్రాజెక్టు నిర్వహణకు ప్రతి 1,500 ఎకరాలకు ఒక లస్కరు ఉండాలి. ● ప్రధాన కాలువల పర్యవేక్షణకు గాను ప్రతి 5 కిలో మీటర్లకు ఒక లస్కరు ఉండాలి. ● కచ్చితంగా ఒక ఎలక్ట్రీషియన్, ఒక ఫిట్టర్, వర్క్ ఇన్‌స్పెక్టర్, వాచ్‌మెన్, హెల్పర్లు ఉండాలి. ● కాలువ గట్టు వెడల్పు మేజర్ ప్రాజెక్టు అయితే ఆరు మీటర్లు, మైనర్ అయితే కాలువ వెడల్పు 2.5 మీటర్ల నుంచి 4 మీటర్లు ఉండాలి. ● సాగునీరు సక్రమంగా అందుతుందా లేదా, కాలువ గట్లు పరిస్థితి, చప్టాలు, మదుములు, స్లాబ్ కల్వర్టులు ఎలా ఉన్నాయి, ఎక్కడైనా ఇబ్బందులు ఉన్నాయా అనే విషయాలు పూర్తి పరిశీలన చేయాల్సిన బాధ్యత లస్కర్లదే.. ● కాలువల ద్వారా నీరు విడుదల చేసినప్పుడు ప్రాజెక్టు పరిధిలో హెల్పర్లు కీలకం.



జంఝావతి ప్రాజెక్టులో కుడి కాలువ దుస్థితి



ఆధునీకరణకు నోచుకోని వట్టిగెడ్డ రిజర్వాయర్ కుడి ప్రధాన కాలువ

ప్రజా పంపిణీ వ్యవస్థ: గాడిలో పడేనా?

- డిపోల ద్వారా మళ్లీ రేషన్ సరఫరాపై భిన్నస్వరాలు
- కొంతమంది డీలర్ల తీరే ఇందుకు కారణం
- గతంలో సమయపాలన పాటించక.. సక్రమంగా సరుకులు అందించని వైనం
- అవకతవకలకు పాల్పడి సస్పెన్షన్లకు గురైన వారెందరో..
- కేసులు నమోదైనా మారని పరిస్థితి
- ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించాలని జిల్లావాసుల విన్నపం



పార్వతీపురం, మే30 (ఆంధ్రజ్యోతి): ప్రజాపంపిణీ వ్యవస్థలో ఎలాంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా డిపోల ద్వారా రేషన్ అందజేయాలని ప్రభుత్వ నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈ మేరకు గత వైసీపీ సర్కారు అమలులోకి తెచ్చిన ఎండీయూ వాహనాల వ్యవస్థను రద్దు చేసింది. జూన్ ఒకటో తేదీ నుంచి రేషన్ దుకాణాల నుంచి కార్డుదారులకు నిత్యావసరాల సరుకులు సరఫరా చేయాలని ఆదేశించింది. ఈ మేరకు జిల్లా యాంత్రాంగం చర్యలు చేపడుతోంది. అయితే డిపో డీలర్లకే మళ్లీ సరుకుల పంపిణీ బాధ్యత అప్పగించడంపై సర్వత్రా భిన్న స్వరాలు విని పిస్తున్నాయి. గతంలో కొంతమంది డీలర్లు కూడా పేదల బియ్యం పక్కదారి పట్టించిన విషయంలో సస్పెన్షన్లకు గురయ్యారు. వారిపై 6ఏ కేసులు నమోదు చేసినా పరిస్థితిలో ఎటువంటి మార్పు లేదు. మరికొందరు సమయ పాలన కూడా పాటించేవారు కాదు. సక్రమంగా రేషన్ డిపోలను తెరిచేవారు కాదు. ప్రతినెలా ఒకటో తేదీ నుంచి 15వ తేదీ లోపు సరుకులు ఇవ్వాల్సి ఉన్నా.. కొంతమంది దానిని పాటించేవారు కాదు. దీంతో కార్డుదారులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. డిపోల ముందు పడిగాపులు కాసేవారు. అయితే ఇకపై ఇటువంటి సమస్యలు పునరావృతం కాకుండా ప్రభుత్వం, ఉన్నతాధికారులు పూర్తిస్థాయిలో పర్యవేక్షణ చేపట్టాల్సి ఉంది. సరుకుల సరఫరాలో ఎటువంటి అవకతవకలు జరగకుండా, కార్డుదారులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని జిల్లావాసులు కోరుతున్నారు.

6ఏ కేసులు నమోదైనా..

పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా రవాణా చేసిన వారిపై 2022 నుంచి ఇప్పటివరకు 29 కేసులు నమోదు చేశారు. జిల్లా నుంచి ఒడిశా ప్రాంతంలో ఉన్న అలమండ, రాయగడ, సుంకి తదితర ప్రాంతాలకు పేదల బియ్యం ఇష్టారాజ్యంగా తరలిస్తున్నారు. దాడుల్లో పట్టుబడిన వారిపై 6ఏ కేసులు నమోదు చేస్తున్నా పరిస్థితిలో మార్పు రావడం లేదు. రేషన్ బియ్యం పక్కదారి పడుతూనే ఉంది. గత వైసీపీ హయాంలో ఈ దందా మరింత జోరుగా సాగింది. తాజాగా కూటమి ప్రభుత్వం దీనిపై ప్రత్యేకంగా దృష్టి సారించాల్సి ఉంది. పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా వెనుక ఉన్న వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉంది.



ఇదీ పరిస్థితి..

జిల్లాలో 578 రేషన్ డిపోలు ఉన్నాయి. వీటి పరిధిలో 2,96,880 రేషన్‌కార్డులు ఉన్నాయి. ఇందులో ఏఏవై కార్డులు 54,930 వరకూ (మిగతా 6వ పేజీలో...)

శాంతిభద్రతల పరిరక్షణలో

ముందుండాలి: ఎస్పీ



మాట్లాడుతున్న ఎస్పీ

పార్వతీపురం టౌన్/బెలగాం, మే30 (ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులంతా ముందుండాలని ఎస్పీ మాధవరెడ్డి సూచించారు. శుక్రవారం పోలీసు కాన్ఫరెన్స్ హాల్‌లో సిబ్బందితో సమీక్షించారు. ' సైబర్ నేరాలు, గంజాయి, నాటుసారా రవాణాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలి. క్షేత్రస్థాయిలో ముందస్తు సమాచార వ్యవస్థను బలోపేతం చేయాలి. అసాంఘిక కార్యక్రమాలకు అడ్డుకట్ట వేయాలంటే రాత్రి వేళ గస్తీ సమయంలో వాహన తనిఖీలను ముమ్మరం చేయాలి. అంతర్రాష్ట్ర చెక్ పోస్టుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. రైల్వే, స్థానిక పోలీసుల సమన్వయంతో ముందుకు సాగాలి. పొగాకు వినియోగం వల్ల కలిగే అనర్థాలపై విస్తృత ప్రచారం చేపట్టాలి.' అని ఎస్పీ తెలిపారు. విధి నిర్వహణలో ప్రత్యేక ప్రతిభ కనబరిచిన అధికారులు, సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సమీక్షలో పాలకొండ డీఎస్పీ ఎం.రాంబాబు, ఎస్బీ సీఐ రంగనాథం, తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి ఉత్సవాలకు సన్నద్ధం

- చురుగ్గా ఇప్పలపోలమ్మ, యర్రకంచమ్మ, బంగారమ్మల పండుగ ఏర్పాట్లు
- సిరిమాను చెట్లకు ప్రత్యేక పూజలు



4లో

ఒకరోజు ముందే

పింఛన్ల పండుగ



సాలూరు రూరల్, మే30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సామాజిక పింఛన్‌దారులకు ఒక రోజు ముందే పింఛన్ నగదు అందించనున్నారు. జూన్ ఒకటో తేదీ ఆదివారం కావడంతో ప్రభుత్వ ఆదేశాల ప్రకారం.. ఈనెల 31న శనివారం ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేయను న్నారు. 'మన్యం'లో 1.39 లక్షల సామాజిక పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు చేశారు. ఈ మేరకు రూ. 59 కోట్ల పైబడి నగదును సిద్ధం చేసినట్టు డీఆర్‌డీఏ పీడీ సుధారాణి శుక్రవారం విలేఖర్లకు చెప్పారు. ఉదయం నుంచే గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు లబ్ధిదారులకు పింఛన్లు అందిస్తారని తెలిపారు. తొలిరోజే శతశాతం పంపిణీ పూర్తయ్యేలా ఏర్పాట్లు చేశామన్నారు.

వంశధారలో పెరిగిన వరద

- రాకపోకలకు ఇబ్బందులు

భామిని, మే 30 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతం ఒడిశాలో జోరుగా వర్షాలు కురుస్తుండడంతో భామిని మండలం నేరడి వద్ద వంశధార నదిలో స్వల్పంగా వరద పెరిగింది. దీంతో శుక్రవారం పలు గ్రామాల ప్రజలు నది దాటి స్వగ్రామాలకు చేరుకునేందుకు నానా అవస్థలు పడ్డారు. ఒడిశా రాష్ట్రం కండవ రైల్వే స్టేషన్ నుంచి ప్రయాణికులు వంశధార నది దాటి నేరడి వచ్చేందుకు కొంత ఇబ్బందులు పడ్డారు. ఒకరికొకరు చేతులు పట్టుకుని నడుం లోతు నీటిలో నది దాటి ఆంధ్రా వైపు గ్రామాలకు చేరుకున్నారు. ఇదిలా ఉండగా భామినిలో సాయంత్రం వర్షం కురవడంతో రైతులు కొంత ఇబ్బందులకు గురయ్యారు. మొక్కజొన్న, ధాన్యం కాపాడుకునే పనిలో పడ్డారు



నేరడి వద్ద వంశధార నదిని దాటి స్వగ్రామాలకు వెళ్తున్న ప్రజలు

ఐటీడీఏలో టీచర్ల బదిలీలకు కౌన్సిలింగ్



కౌన్సిలింగ్ నిర్వహిస్తున్న ఇన్‌చార్జి పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డి

సీతంపేట రూరల్, మే 30 (ఆంధ్రజ్యోతి): సీతంపేట ఐటీడీఏ కార్యాలయంలో శుక్రవారం టీచర్ల బదిలీలకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఇన్‌చార్జి పీవో సి.యశ్వంత్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ ప్రక్రియ నిర్వహించారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న హెచ్‌ఎం, హెచ్‌డబ్ల్యూవో, స్కూల్ అసిస్టెంట్లు, నాలుగో తరగతి ఉద్యోగులంతా హాజరయ్యారు. మొదటి విడతలో 88 మందికి కౌన్సిలింగ్ నిర్వహించారు. వారితో పాటు నలుగురు హెచ్‌డబ్ల్యూవోలు, ఫోర్త్‌క్లాస్ ఉద్యోగులకు కూడా కౌన్సిలింగ్ నిర్వహించి నిబంధనల ప్రాప్తికి బదిలీలు చేపట్టారు. ఒకేచోట ఐదేళ్లు పనిచేసిన వారికి తప్పనిసరి బదిలీ చేశారు. రెండేళ్లు దాటి పనిచేసిన వారికి ప్రాధాన్య క్రమంలో నిబంధనలకు అనుసరించి స్థానచలనం కల్పించారు. జీవో నెంబర్ 23 ప్రాప్తికి బాలికల ఆశ్రమ పాఠశాలల్లో ఉపాధ్యాయునులు ఉండేలా బదిలీలు చేపడుతున్నామని ఇన్‌చార్జి పీవో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీవో చిన్నబాబు, డీడీ అన్నదొర, ఏటీడబ్ల్యూవో మంగవేణి తదితరులు పాల్గొన్నారు.

ఐటీడీఏ వేదికగా

పీవోల కాన్ఫరెన్స్

- 3న సమావేశం
- ఏర్పాట్లలో అధికారులు

6లో

జీవితాలకు పొగ

- ఖైనీ, చుట్ట, బీడీ, సిగరెట్లతో ముప్పు
- ఉమ్మడి జిల్లాలో పెరుగుతున్న నోటి క్యాన్సర్ బాధితులు
- నేడు ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం



4లో

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్
- తోటపల్లిలో యోగాంధ్ర నిర్వహణ

గరుగుబిల్లి, మే 30 (ఆంధ్రజ్యోతి): యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్‌తెలిపారు. శుక్రవారం తోటపల్లి ప్రాజెక్టు పరిధిలోని కుడి మట్టికట్ట ప్రాంతంలో యోగాంధ్ర నిర్వహించారు. ఈ సందర్భంగా 1500 మంది వివిధ రకాల ఆసనాలు వేశారు. కలెక్టర్ శిక్షకునిలా మారి పలువురితో యోగా చేయించారు. మొత్తంగా యోగా నిర్వాహకులతో తోటపల్లి ప్రాజెక్టు ప్రాంతం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. యోగాంధ్రలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలన్నారు. జిల్లాలోని 15 మండలాలు, పట్టణాల్లో యోగా శిక్షణ కార్యక్రమాలకు అనూహ్య స్పందన లభిస్తుందన్నారు. పర్యాటకులను ఆకర్షించే విధంగా తోటపల్లి ప్రాంతం సుందరీకరణకు చర్యలు చేపడుతున్నామన్నారు. బోటు షికారు, మట్టికట్ట ఆధునికీకరణ, ఐటీడీఏ పార్కు ప్రాంతంతో పాటు రహదారికి ఆనుకుని ఖాళీ ప్రాంతాలను చదును చేయిస్తామని తెలిపారు. పార్వతీపురం సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ మాట్లాడుతూ.. యోగా నిత్య అలవాటుగా మార్చుకోవాలన్నారు. చాలామంది యువత ఇంటర్నెట్‌లో మునుగుతున్నారన్నారు. వ్యాయామం లేకపోవడంతో పలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని తెలిపారు. యోగాతో వ్యక్తిత్వ వికాసం పెరుగుతుందన్నారు. ప్రతి కుటుంబంలో యోగం భాగం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో భాస్కరరావు, ఎస్డీసీ ప్రాజెక్టు అధికారి జగన్, డీపీఎమ్‌వో రఘు, డ్వామా పీడీ రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.



యోగా చేస్తున్న కలెక్టర్, సబ్ కలెక్టర్, డీఎంహెచ్‌వో తదితరులు

2న జూనియర్ కళాశాలల

పునఃప్రారంభం

- డీఐఈవో నాగేశ్వరరావు



జియ్యమ్మవలస, మే30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలలను జూన్ 2న పునః ప్రారంభించనున్నట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యా శాఖాధికారి (డీఐఈవో) నాగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ.. జిల్లాలో 14 ప్రభుత్వ జూనియర్ కళాశాలలతో పాటు మరో 74 ప్రైవేట్, కేజీబీవీ, సోషల్ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్ జూనియర్ కళాశాలలు ఉన్నాయన్నారు. కళాశాలలు పునఃప్రారంభమైన మరుసటి రోజే (మిగతా 6వ పేజీలో...)

జీవితాలకు పొగ



- జిల్లాలో పెరుగుతున్న నోటి క్యాన్సర్ బాధితులు
- ఖైనీ, చుట్ట, బీడీ, సిగరెట్లతో ముప్పు
- ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో పొగాకు విముక్తి కేంద్రం

నేడు ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం

విజయనగరం రింగురోడ్డు/ రాజాం రూరల్, మే 30 (ఆంధ్రజ్యోతి)

పొగాకు.. హాయిగా సాగే మనిషి జీవితంలో మంటలు రేపుతోంది. సరదాగా ఒకసారి మొదలు పెట్టిన ధూమపానం వ్యసనంగా మారి చివరకు ప్రాణాలను బలిగొంటోంది. నేడు యువత నుంచి వృద్ధుల వరకూ ఖైనీ, గుట్కా, పాన్‌తో పాటు బీడీ, చుట్ట, సిగరెట్లు కాల్చుతున్నారు. ఇవి మనిషికి మత్తును, ఉద్రేకాన్ని కలిగిస్తూ, తాత్కాలిక ఆనందాన్నిస్తున్నాయి. మరోవైపు దీర్ఘకాలికంగా క్యాన్సర్ వ్యాధి బారిన పడేస్తున్నాయి. క్యాన్సర్ కారకాలు గల పొగాకును ఏ రూపంలో తీసుకున్నా నష్టమేనని వైద్యులు హెచ్చరిస్తున్నారు. శనివారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం. ఈ సందర్భంగా దీని వల్ల కలిగే అనర్థాలను పరిశీలిస్తే..

సరదాగా మొదలై..

పొగాకు సంబంధిత ఉత్పత్తులను మొదట సరదా కోసం మొదలు పెడతారు. ఆ తరువాత అది వ్యసనంగా మారి చివరకు ప్రాణాంతకంగా మారుతోంది. వ్యసనానికి గురైన వ్యక్తి తనకు వచ్చే వేతనంలో 70 శాతం పొగాకు సంబంధిత ఉత్పత్తులకే ఖర్చు పెడుతున్నారన్నది అంచనా. జిల్లాలో నెలకు సుమారు రూ.10 కోట్లకు పైగా పొగాకు ఉత్పత్తులు అమ్ముడవుతున్నట్లు ఓ అంచనా. సిగరెట్ పొగలో విషపూరితమైన నికోటిన్, కార్బన్ మోనాక్సైడ్, ఆర్సనిక్, బెంజిన్, ఆమ్మోనియా, రేడాన్, ఫార్మాల్డిహైడ్ తదితర రసాయనాలు ఉంటాయి. వీటి కారణంగా 25 రకాల జబ్బులు సంక్రమిస్తాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) తెలిపింది. దీని వల్ల ఎక్కువగా నోటి క్యాన్సర్ బారిన పడుతున్నారు.

పొగ పీల్చినా నష్టమే..

● నేరుగా సిగరెట్ కాల్చేవారికి వచ్చే జబ్బులన్నీ దాదాపుగా వారి పక్క నుంచి పొగ పీల్చే వారికీ (పాసివ్ స్మోకర్స్) వస్తాయి. పొగ తాగడం వల్ల కలిగే అనర్థాలపై అధ్యయనాలు ఏం చెబుతున్నాయంటే... ● సాధారణ వ్యక్తులతో పోలిస్తే ఇంట్లో పొగ తాగేవారి పక్కన ఉండేవారికి ఊపిరితిత్తులు, క్యాన్సర్, హృదయ సంబంధ వ్యాధులు వచ్చే ప్రమాదం 25 శాతం ఎక్కువ. ● పొగ తాగేవారి పక్కన మీరు 30 నిమిషాలు ఉంటే మీ గుండెకు రక్తప్రసరణ వేగం మందగిస్తుంది. ● కళ్లలో మంట, నీరు కారడం, తలనొప్పి, దగ్గు, నీరసం ఇలాంటి ఇబ్బందులెన్నో ఎదురవుతాయి. ● అప్పుడప్పుడు సరదాగా సిగరెట్ తాగిన వారికి కూడా ఊపిరితిత్తుల సామర్థ్యం దెబ్బతింటుంది. ● ఉబ్బసం రోగులు ఊపిరి పీల్చుకోలేక ఇబ్బందులకు గురవుతారు. పిల్లలు, వృద్ధులకు చాలా ఇబ్బందులు ఎదురవుతాయి. ● పిల్లల్లో నేర్చుకునే ఆసక్తి సన్నగిల్లుతుంది. ఉత్సాహం కొరవడుతుంది. ఎదుగుదలపై కూడా ప్రభావం చూపుతుంది. ● చెవి సంబంధిత ఇన్‌ఫెక్షన్లు, ఎలర్జీలకు ఆస్కారం ఉంటుంది.



ప్రభుత్వ సర్వజనాసుపత్రిలోని పొగాకు విముక్తి కేంద్రం

అనర్థాలు ఇవే..

● సిగరెట్, బీడీ, చుట్టలకు సంబంధించిన పొగ తాగడం వల్ల ఊపిరితిత్తుల క్యాన్సర్ వస్తుంది. ఇవి ఊపిరితిత్తుల కణాలను దెబ్బతీస్తాయి. ● గుండెపోటు, అధిక రక్త పోటు, పక్షవాతం వంటి సమస్యలు వస్తాయి. ● పొగ తాగేవారిలో నోటి క్యాన్సర్, గొంతు క్యాన్సర్, అన్నవాహిక క్యాన్సర్ వచ్చే ప్రమాదం అధికంగా ఉంది. ● ఖైనీ, నమిలే పొగాకు వల్ల నోటి క్యాన్సర్ వస్తుంది. ● నోటి లోపలి భాగంలో చిగుళ్ల, నాలుక, పెదవులపై క్యాన్సర్ కణాలు ఏర్పడతాయి. ● నోటి లోపలి భాగంలో మృదువైన కణజాలం గట్టి పడడంతో నోరు తెరవడం కష్టమవుతుంది. ● దంతాలపై ఎనామిల్ క్షీణించడం, దంత క్షయం, చిగుళ్ల వ్యాధులు, దంతాలు ఊడిపోవడం. ● నోట్లో పుండ్లు, చిగుళ్ల రక్తస్రావం జరుగుతుంది. ● పొట్టలో అల్సర్లు, జీర్ణాశయ సమస్యలు ఉత్పన్నమవుతాయి.

ఉచితంగా పరీక్షలు.. చికిత్స

ప్రమాదకర పొగాకు వ్యసనం నుంచి బయటపడేందుకు జిల్లా ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలోని పొగాకు విముక్తి కేంద్రం (టీసీసీ) అందుబాటులో ఉంది. అక్కడ సర్జికల్, మెడికల్ అంకాలజిస్ట్, డెంటిస్ట్, సైకాలజిస్టులు అందుబాటులో ఉంటారు. వీరు పొగాను వ్యసనం నుంచి బయటపడేందుకు కౌన్సెలింగు, మందులు, చికిత్సలు వంటి సహాయ, సహకారాలు అందిస్తారు

జిల్లాలో నోటి క్యాన్సర్ కేసులు ఇలా..

సంవత్సరం	పురుషులు	స్త్రీలు	మొత్తం కేసులు
2021	879	227	1,106
2022	1,607	574	2,181
2023	1,341	483	1,824
2024	767	572	1,339
2025 (ఏప్రిల్ వరకూ)	328	142	470

● వ్యసనం నుంచి బయట పడవచ్చు..



పొగాను వ్యసనం నుంచి బయటపడేందుకు అత్యాధునిక చికిత్సలు అందుబాటులో వున్నాయి. ప్రభుత్వ సర్వజనాసుపత్రిలో పొగాకు విముక్తి కేంద్రం (టీసీసీ) వుంది. ఇక్కడ కౌన్సిలింగు నిర్వహించడంతో పాటుగా పొగానకు ప్రత్యామ్నాయంగా అందుబాటులో వున్నాయి. అంటే నికోటిన్ గమ్స్, పేచస్ అందుబాటులో వున్నాయి. ఇవి వాడితే, పొగాకు సంబందిత పదార్థాలు తీసుకోవడం వల్లే వచ్చే భావనే కలుగుతుంది. ఎటువంటి హాని కలిగించవు. అలాగే వీటితో పాటు, కౌన్సిలింగు కొన్ని ఔషదాలు వల్ల పొగాకు వ్యసనం నుంచి బయట పడవచ్చును. ముఖ్యంగా సిగరెట్, బీడీ, ఖైనీలకు అలవాటు పడే వారు మానలేకపోతే, ఇక్కడకు వచ్చి చికిత్స తీసుకుంటే వ్యసనం నుంచి బయటపడే అవకాశం వుంది.

-డాక్టర్ శ్రీరామ జనార్ధనరావు, అసోసియేట్ ప్రొఫెసర్, డెంటల్ హెచ్ఓడీ, ప్రభుత్వ సర్వజనాసుపత్రి, విజయనగరం

● పొగాకుతో నోటి క్యాన్సర్..



పొగాకు వినియోగం వల్ల ఎక్కువ మందిలో నోటి క్యాన్సర్ వచ్చే అవకాశం ఉంది. ఆహారం మింగడంలో నొప్పి లేదా ఇబ్బంది ఏర్పడుతుంది. నోరు, దవడల్లో గడ్డలు, వాపులు, మెడ లేదా దవడ కింద వాపు, గడ్డలు ఏర్పడతాయి. నోటి క్యాన్సర్‌కు చికిత్స చేయకుండా వదిలేసి చివరి దశలో గుర్తించినట్టయితే, అది ప్రాణాంతకమయ్యే అవకాశం చాలా ఎక్కువ. ఎటువంటి లక్షణాలు ఉన్నా.. దంత వైద్యులు, సర్జికల్ అంకాలజిస్టులను కలసి పరీక్షలు చేయించుకోవాలి.

-డాక్టర్ ఎ.కామేశ్వరరావు, అసిస్టెంట్ ప్రొఫెసర్, డెంటల్ విభాగం, ప్రభుత్వ సర్వజనాసుపత్రి, విజయనగరం

● పొగతో ఎన్నో సమస్యలు

చుట్ట, బీడీ, సిగరెట్ తదితర పొగాకు ఉత్పత్తుల వినియోగం ఆరోగ్యంపై దుష్ప్రభావం చూపుతుంది. పొగాకులో ఉండే క్యాన్సర్ కారకాలు ఎంతో ప్రాణాంతకంగా మారుతాయనడంలో సందేహం లేదు. సరదాగా ప్రారంభమైన పొగ తాగడం.. వ్యసనంగా మారి ప్రాణాల మీదకు వస్తుందన్న విషయాన్ని యువత అర్థం చేసుకోవాలి.

-డా.గార రవిప్రసాద్, ఎం.డి., జనరల్ మెడిసిన్, రాజాం

అమ్మో..ఏనుగులు

● రెండు గ్రామాల నడుమ సంచారం

గరుగుబిల్లి, మే 30 (ఆంధ్రజ్యోతి): సంతోషపురం పంచాయతీ పరిధిలోని రెండు గ్రామాల మధ్య గజరాజులు సంచరిస్తున్నాయి. గురువారం నందివానివలస నుంచి సంతోషపురం మీదుగా పిట్టలమెట్టకు చేరుకున్నాయి. శుక్రవారం ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న ఖడ్గవలస, పిట్టలమెట్ట గ్రామాల మధ్య హల్‌చల్ చేశాయి. దీంతో ఇరు గ్రామల ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఏ క్షణాన ఏం జరుగుతుందోనని బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. గజరాజుల కార ణంగా పొలాల వైపు వెళ్లలేకపోతున్నామని, ఖరీఫ్ పనులు చేయలేకపోతున్నామని రైతులు వాపోతున్నారు. ఏనుగులను ఈ ప్రాంతం నుంచి తరలించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు అటవీ శాఖ సిబ్బంది, ట్రాకర్లు ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. ఏనుగులు సంచరిస్తున్న కారణంగా రాత్రి సమయంలో పొలాలు, రహదారుల వైపు ఎవరూ రాకూడదని హెచ్చరిస్తున్నారు.


పిట్టలమెట్ట ప్రాంతంలో సంచరిస్తున్న ఏనుగుల గుంపు

సైనికుల త్యాగం చిరస్మరణీయం

● కలెక్టర్ అంబేడ్కర్

విజయనగరం కలెక్టరేట్, మే 30 (ఆంధ్రజ్యోతి): దేశం కోసం అశువులు బాసిన సైనికుల త్యాగం చిరస్మరణీయమని కలెక్టర్ అంబేడ్కర్ కొనియాడారు. జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయ ప్రాంగణంలో నిర్మిం చిన యుద్ధ స్థూపాన్ని, వాల్ ఆఫ్ హీరోస్ శిలాఫలకాన్ని ఆయన శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సైనికుల ధైర్య, సాహసాలు, వారి త్యాగం ఎప్పటికీ మర్చిపోలేనివని అన్నారు. అహర్నిశలూ సరిహద్దుల్లో వారు కాపలా ఉండటం వల్ల మనమంతా క్షేమంగా ఉండగలుగుతున్నామన్నారు. సైనికులకు ప్రతి ఒక్కరూ రుణపడి ఉంటారని స్పష్టం చేశారు. జిల్లాలో మాజీ సైనికుల సంక్షేమానికి తమవంతు కృషి చేస్తామన్నారు. వారి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. రెవెన్యూ సమస్యల పరిష్కారానికి త్వరలో సంబంధిత అధికారులతో సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు.

● సైనిక సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సత్యప్రసాద్ మాట్లా డుతూ ఆపరేషన్ సిందూర్ తర్వాత దేశంలో ఆవిష్కరించిన తొలి యుద్ధస్థూపం ఇదే నన్నా రు. సైన్యంలో పని చేస్తూ అశువులు బాసిన జి ల్లాకు చెందిన 11 మంది వీరమాతలకు, వీర నారీమణులకు రాష్ట్ర సైనిక సంక్షేమ శాఖ తర పున రూ.5000 చొప్పున నగదు అందజేశారు. జిల్లా సైనిక సంక్షేమ అధికారి మజ్జి కృష్ణారావు, ఎన్సీసీ జిల్లా బాలికల బెటాలియన్ కమాండింగ్ అధికారి కల్నల్ గోపేంద్ర, శ్రీకాకుళం జిల్లా సైనిక సంక్షేమ అధికారి శైలజ, ఆ శాఖ విశ్రాంతి సహాయ సంచాలకులు రాజారావు, కార్పొరేటర్ పిన్నింటి వరలక్ష్మి, సైనిక సంక్షేమ సంఘ నాయకులు ఈశ్వరరావు పాల్గొన్నారు.

యోగా శిక్షణ కేంద్రాలతో అవగాహన

● మంత్రి కొండపల్లి శ్రీనివాస్

విజయనగరం, మే 30 (ఆంధ్రజ్యోతి): యోగా ప్రాధాన్యాన్ని ప్రజలకు తెలియజేసేందుకు శిక్షణ కేంద్రం ఏర్పాటు చేసి, అవగాహన కల్పిస్తామని రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. జిల్లాలోని ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రం రామనారాయణంలో శుక్రవారం జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. రామనారాయణం చెంత శ్రీరాముని ధనుస్సు ఆకృతిలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్, కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్, జేసీ సేతుమాధవన్‌తో పాటు సుమారు 1,500 మంది ప్రభుత్వ అధికారులు సిబ్బంది, పరిసర గ్రామాల ప్రజలు యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి మాట్లాడుతూ, మన పూర్వీకులు మనకు అందించిన గొప్ప ఆస్తి యోగా అని.. దీనిని సాధన చేయడం ద్వారా మన ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చని తెలిపారు. కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ మాట్లాడుతూ యోగాంధ్రలో భాగంగా జిల్లాలోని నాలుగు పర్యాటక ప్రదేశాల్లో కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. రామనారాయణం, చింతపల్లి బీచ్, రామతీర్థం, తాటిపూడి రిజర్వాయర్ తదితర ప్రదేశాల్లో కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. జేసీ సేతుమాధవన్ మాట్లాడుతూ నెల రోజుల యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా జిల్లాలో 7.8 లక్షల మందిని భాగస్వామ్యులను చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ కల్యాణచక్రవర్తి, పర్యాటకశాఖాధికారి కుమారస్వామి, డీఎస్‌డీఓ వెంకటేశ్వరరావు, డీఎంహెచ్‌ఓ జీవనరాణి, ఆయుష్ అధికారి ఆనందరావు, రామనారాయణం ప్రతినిధులు చంద్రకళ, శ్రీనివాసరావు, యోగా గురువులు డాక్టర్ ఆరిశెట్టి ఇందుమతి, ఆరి సుందరశివరావు తదితరులు పాల్గొన్నారు.


యోగా చేస్తున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్


రామనారాయణంలో యోగాంధ్ర ఆకృతిలో జనం


యోగా చేస్తున్న కలెక్టర్ అంబేడ్కర్, జేసీ సేతుమాధవన్

ఎస్.కోటలో ఐదువేల మందితో యోగాంధ్ర

- ఉపాధి హామీ వేతనదారులతో 10న నిర్వహణ
- జేసీ సేతు మాధవన్

విజయనగరం కలెక్టరేట్, మే 30 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ వేతనదారులతో జూన్ 10న రాష్ట్రస్థాయి యోగాంధ్ర కార్యకమాన్ని ఎస్.కోటలో నిర్వహించనున్నట్లు జేసీ సేతు మాధవన్ వెల్లడించారు. సుమారు 5వేల మంది ఉపాధి హామీ వేతనదారులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. యోగాంధ్రపై శుక్రవారం తన చాంబర్‌లో జిల్లా అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యక్రమం నిర్వహణకు అనువైన స్థలాన్ని గుర్తించాలన్నారు. పాల్గొనే వారంతా నిర్దీత సమయానికి ప్రాంగణంలో ఉండేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా పాఠశాల విద్యా ర్థులకు 15 రకాల పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అన్ని మండలాల్లో యువత పాల్గొనేలా చూడాలన్నారు. జిల్లాలోని సీనియర్ సిటిజన్లతోనూ యోగాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. డీఆర్‌డీఏ పీడీ కల్యాణ చక్రవర్తి, డ్వామా పీడీ శారదాదేవి, వ్యవసాయ శాఖ జేడీ రామారావు, డీఎస్‌డీవో వెంకటేశ్వరరావు, డీఎల్‌డీవో రోజారాణి, డీఈవో మాణిక్యంనాయుడు, హౌసింగ్ పీడీ మురళి మోహన్, పర్యాటక శాఖ అధికారి కుమారస్వామి పాల్గొన్నారు.

అమ్మవారి ఉత్సవాలకు సన్నద్ధం

● చురుగ్గా ఇప్పలపోలమ్మ, యర్రకంచమ్మ, బంగారమ్మల పండుగ ఏర్పాట్లు

పార్వతీపురం టౌన్, మే 30 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం పట్టణం, జగన్నాథపురం, బెలగాం ప్రజల ఇలవేల్పులు ఇప్పలపోలమ్మ, యర్రకంచమ్మ, బంగారమ్మల పండుగలను ఆదివారం నుంచి నిర్వహించేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. మున్సిపల్, విద్యుత్ సిబ్బంది సంబంధిత విభాగాలకు చెందిన పనులు చేపడుతున్నారు. ఉత్సవాలకు విశాఖపట్నం, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల నుంచి సుమారు 3 లక్షల మంది వరకు వచ్చే అవకాశం ఉంది. దీన్ని దృష్టిలో పెట్టుకొని ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పోలీసులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

తాగునీరు, పారిశుధ్యానికి రూ.40 లక్షలు

ఉత్సవాల నేపథ్యంలో తాగునీటి సరఫరా, పారిశుధ్య పనులకు రూ.40 ఖర్చులు చేస్తున్నట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు. పార్వతీపురం మున్సిపాల్టీలో 103 మంది పారిశుధ్య కార్మికులు ఉండగా... అదనంగా 30 మందిని నియమిస్తున్నారు. మూడు రోజుల పాటు నిరంతరం తాగునీటి సరఫరా చేయనున్నట్లు అధికారులు తెలిపారు. జిల్లా కేంద్రంలోని 30 వార్డులతో పాటు శివారు కాలనీలకు ట్యాంకర్లతో తాగునీటి సరఫరా చేస్తామని ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు.

● విద్యుత్ సరఫరాకు...

యర్రకంచమ్మ తల్లి సిరిమాను వెళ్లేందుకు వీలుగా టౌన్ పోలీసు స్టేషన్ నుంచి జగన్నాథపురం వరకు గల వీధుల్లో 17 నూతన విద్యుత్ స్తంభాలను ఆ శాఖాధికారులు వేసున్నారు. వరహాల గెడ్డ నుంచి రాయగడ రోడ్డు శివారు వరకు సిరిమానులు తిరుగుతున్న సమయంలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపడుతున్నారు. రాయగడ రోడ్డు, వివేకానంద కాలనీ, కొత్తవలస, బంగారమ్మ కాలనీల్లో 40 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌లతో పాటు నూతనంగా 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తున్నారు. ఈ పనులకు రూ.70 లక్షలు ఖర్చు చేస్తున్నామని డీఈ వెంకటరమణ తెలిపారు.


గూడ్స్‌షెడ్ రోడ్డులో ట్యాంకర్‌తో తాగునీరు సరఫరా చేస్తున్న దృశ్యం



ఇప్పలపోలమ్మ, యర్రకంచమ్మ

● శివారుకు ట్యాంకర్లతో నీరు

గ్రామదేవతల పండుగ సందర్భంగా తాగునీరు, పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నాం. దీని కోసం రూ.25 లక్షలు ఖర్చు చేశాం. ఇంకా రూ.15 లక్షల వరకు ఖర్చు చేసేందుకు సిద్ధంగా ఉన్నాం. శివారు కాలనీలకు ఇప్పటికే 7 ట్యాంకర్ల ద్వారా తాగునీటిని అందిస్తున్నాం.

-సీహెచ్.వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్, పార్వతీపురం


ఇప్పలపోలమ్మ సిరిమాను చెట్టు వద్ద పూజలు చేస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

సిరిమాను చెట్లకు ప్రత్యేక పూజలు

పార్వతీపురం టౌన్, మే 30 (ఆంధ్రజ్యోతి): మన్యం జిల్లా కేంద్ర ప్రజల ఇలవేల్పులు ఇప్పలపోలమ్మ, యర్రకంచమ్మల సిరిమాను చెట్లకు ఉత్సవ కమిటీల సభ్యులు ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం నుంచి ఉత్సవాలు నిర్వహించనున్న సంగతి తెలిసిందే. శుక్రవారం ఉదయం జిల్లా కేంద్రంలోని నాయుడు వీధిలో గల ఇప్పలపోలమ్మ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. అనంతరం రెడ్డి వీధి శివారుల్లో గల బుగత జగన్నాథం తోటలోని సిరిమాను చెట్టుకు ఉత్సవ కమిటీ సభ్యులు పసుపు, కుంకుమలతో పూజలు చేశారు. అనంతరం గ్రామ రైతులు సిరిమాను చెట్టును ఇప్పలపోలమ్మ ఆలయం వద్దకు తీసుకువచ్చారు. ఇప్పలపోలమ్మ, సోదరి జగన్నాథపురం యర్రకంచమ్మ తల్లి సిరిమాను చెట్టును రాధమ్మపేట సమీపంలోని రెడ్డి సీతారాం పొలంలో గుర్తించారు. శుక్రవారం ఉదయం మేళతాళాల మధ్య యర్రకంచమ్మ సిరిమాను చెట్టు వద్ద పూజారి నక్కా వాసు, ఉత్సవ కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయం వద్దకు తరలించారు.

గోకులాలకు బిల్లులేవీ?

● నాలుగు నెలలైనా జరగని చెల్లింపులు ● పశుపోషకులకు తప్పని ఆవేదన


గజపతినగరంలో నిర్మించిన గోకులం షెడ్

గజపతినగరం, మే 30 (ఆంధ్రజ్యోతి): పశు పోషకులను ప్రోత్సాహించేందుకు ప్రభుత్వం ఉపాధి హామీ పథకం ద్వారా గోకులాల నిర్మాణాలను చేపట్టింది. ఇందుకోసం లబ్ధిదారులకు పెద్దఎత్తున రాయితీని ప్రకటించింది. పశువులకు సౌకర్యంగా ఉంటుందనే భావనతో పశు పోషకులు సంబంధిత శాఖ నుంచి అనుమతులు తీసుకుని గోకులాల నిర్మాణాలు చేపట్టారు. రెండు పశువులకు రూ.1.15 లక్షలు, నాలుగు పశువులకు రూ.1.85 లక్షలు, 6 పశువులకు సంబంధించిన గోకులాల నిర్మాణాలకు రూ2.30 లక్షలు చొప్పున మంజూరుకు ప్రభుత్వం ప్రకటించింది. అందులో 90 శాతం ప్రభుత్వం రాయితీ కల్పించింది. నిర్మాణం పూర్తయిన తర్వాత బిల్లుల చెల్లింపునకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. దీంతో గజపతినగరం నియోజకవర్గం పరిధిలో 324 గోకులాలు మంజూరు చేశారు. గజపతినగరం మండలంలో 86, దత్తిరాజేరు మండలంలో 26, బొండపల్లి మండలంలో 54, గంట్యాడ మండలంలో 118, జామిమండలంలో 37 గోకులాల నిర్మాణాలు జరిగాయి. పనులు పూర్తి చేసిన వెంటనే బిల్లులు వస్తాయన్న ఆశతో పశు పోషకులు యుద్ధప్రాతిపదికన నిర్మాణాలు చేపట్టారు. అయితే పనులు పూర్తయి నాలుగు నెలలు గడుస్తున్నా ప్రభుత్వం బిల్లులు మంజూరు చేయలేదు. దాంతో పశుపోషకులు అసంతృప్తి చెందుతున్నారు. తక్షణమే బిల్లులు వస్తాయని ఒప్పించి నిర్మాణాలు చేయించిన అధికారులు ఇప్పుడు ముఖం చాటేస్తున్నారు. గోకులాల నిర్మాణాలను అప్పుచేసి చేపట్టామని, వడ్డీలు పెరుగుతున్నాయని పశు పోషకులు అంటున్నారు.

జిల్లా అధికారుల దృష్టికి తీసుకువెళ్లాం..

గోకులాల నిర్మాణాలకు సంబంధించి పశు పోషకులకు రావల్సిన బిల్లులు చెల్లింపులపై జిల్లా అధికారుల దృష్టికి తీసుకు వెళ్లాం. జిల్లా అధికారులు.. కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లగా ఆయన స్పందించారు. వారం, పది రోజుల్లో బిల్లులు చెల్లింపు జరిగే అవకాశం ఉంది. పశుపోషకులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

-బి.కృష్ణవేణి, ఏపీవో, గజపతినగరం

108 వాహనానికి సుస్తీ


వాహనాన్ని నెడుతున్న దృశ్యం

భోగాపురం, మే30(ఆంధ్రజ్యోతి): అత్యవసర సమయాల్లో రోగులు, క్షతగాత్రులను తరలించే భోగాపురం ప్రాంతానికి చెందిన 108 వాహనానికి సుస్తీ చేసింది. మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఎప్పటిలాగే నిలిపిన వాహనాన్ని నడిపేందుకు శుక్రవారం సంబంధిత డ్రైవర్ యత్నించారు. అయితే అది కదలలేదు. పలువురు వాహనాన్ని నెట్టినా ముందుకు సాగక మొరాయించింది. దాంతో ఆ వాహనాన్ని అక్కడే వదిలేశారు.

తూనిక యంత్రాల పరిశీలన


డీలర్లు తీసుకువచ్చిన తూనిక యంత్రాలు

భోగాపురం, మే 30 (ఆంధ్రజ్యోతి): చౌక ధరల దుకాణాల్లో జూన్ 1 నుంచి నిత్యావసర సరుకుల పంపిణీకి ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో తూనిక యంత్రాలను స్థానిక రెవెన్యూ కార్యాలయం ఆవరణలో శుక్రవారం సంబంధిన అధికారులు పరిశీలించారు. చిన్న చిన్న లోపాలను సరి చేశారు.

ముగిసిన శిక్షణ శిబిరం

రాజాం, మే 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపాలిటీ పరిధి మెంటిపేటలోని ప్రభుత్వ బాల భవన్‌లో ఏప్రిల్ 24 నుంచి నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరం శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా స్థానిక వ్యాపారవేత్త కొత్తా సాయిప్రశాంత్‌కుమార్ మాట్లాడుతూ 40 రోజుల పాటు పిల్లలకు సంగీతం, నృత్యం, చిత్రలేఖనం, తబలాపై శిక్షణ ఇచ్చామన్నారు. శిబిరం ముగింపు సందర్భంగా చిన్నారుల ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సామాజిక సేవకుడు పెంకి చైతన్య కుమార్, అద్దంకి గోపి, డైరెక్టర్ ఎస్.రమేశ్ తదతరులు పాల్గొన్నారు.

క్రీడాకారిణుల ఎంపిక రేపు

విజయనగరం రూరల్, మే 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక విజ్జీ స్టేడియంలో ఆదివారం అండర్-15, 19, 23 క్రికెట్ క్రీడాకారిణుల ఎంపిక చేపట్టనున్నట్టు క్రికెట్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.సీతారామరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిక పోటీలకు ఉదయం 7.30 గంటలకు హాజరుకావాలని కోరారు.

ప్లాస్టిక్ కవర్లు వాడవద్దు

గుర్ల, మే 30 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ కవర్లు నిర్మూలించాలని కోరుతూ మండల పరిషత్ అధికారులు శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ప్లాస్టిక్ కవర్ల వాడకం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. పర్యావరణ పరిరక్షణకు అందరూ నడుం బిగించాలన్నారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

కొత్తవలసలో భారీ వర్షం

కొత్తవలస, మే 30 (ఆంధ్రజ్యోతి): కొత్తవలసలో శుక్రవారం సాయంత్రం కుండపోత వర్షం కురిసింది. సాయంత్రం 4 నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు ఏకదాటిగా భారీ వర్షం కురిసింది. కొత్తవలస జంక్షన్‌లో వరద నీటితో నిండింది. రైల్వే అండర్ బ్రిడ్జి కింద నీరు భారీగా చేరింది.

●శృంగవరపుకోట: శృంగవరపుకోటలో శుక్రవారం సాయంత్రం కురిసిన వర్షానికి పట్టణ పరిధిలోని విశాఖ-అరకు రోడ్డును వరదనీరు ముంచెత్తింది. రోడ్డుతో పాటు ప్రభుత్వ పాఠశాల క్రీడా మైదానం చెరువును తలపించింది. ఈ రోడ్డుపై ప్రయాణించినవారు ఇబ్బందులకు గురయ్యారు.

●గుర్ల: మండలంలో శుక్రవారం సాయంత్రం గంట పాటు భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో ఏకధాటిగా దద్దరిల్లింది. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు: ఎస్పీ

విజయనగరం క్రైం, మే 30 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు శాఖలో వివిధ హోదాల్లోని పోలీసు అధికారులు, సిబ్బంది సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్టు ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు వెల్ఫేర్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బంది నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు సిబ్బం ది సమస్యల పరిష్కారానికి, సంక్షేమానికి ప్రాధాన్యం కల్పిస్తామన్నారు. సమస్యల పూర్వాపరాలను పరిశీలించి పరిష్కరించేందుకు త్వరితగతిన చర్యలు చేపడతామన్నారు.

సబ్ జైలులో ఆకస్మిక తనిఖీ


జైలును పరిశీలిస్తున్న న్యాయాధికారి

శృంగవరపుకోట, మే 30 (ఆంధ్రజ్యోతి): శృంగవరపుకోటలోని సబ్ జైలును శుక్రవారం న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి, న్యాయాధికారి డాక్టర్ ఎ.కృష్ణప్రసాద్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఖైదీలతో మాట్లాడారు. సదుపాయాలపై ఆరా తీశారు. స్టోర్ రూంలోని సరుకుల నాణ్యతను పరిశీలించారు. కేసుల పరిష్కారానికి జైలు సూపరింటెండెంట్ ద్వారా మండల న్యాయ సేవాకమిటీని సంప్రదించాలని సూచించారు. అనంతరం ఉచిత న్యాయ సహాయం ఖైదీలకే కాకుండా బయటవారికీ అందిస్తామన్నారు. ఇందుకు ప్రతి కోర్టు ప్రాంగణంలోను న్యాయ సేవాసంస్థను ఏర్పాటు చేశామన్నారు. జూలై 5న జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నామన్నారు. రాజీకు ఆమోదయోగ్యమైన సివిల్, క్రిమినల్ కేసులను పరిష్కరించుకోవాలని సూచించారు. ఆయనతో పాటు న్యాయవాది టీవీ రమణమూర్తి, జైలు అధికారులు ఉన్నారు.

రూ.35 లక్షలతో ఉపకరణాలు


వీల్ చైర్లు పరిశీలిస్తున్న ఏపీసీ రామారావు

విజయనగరం కలెక్టరేట్, మే 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోని 377 మంది దివ్యాంగ విద్యార్థులకు రూ.35 లక్షలతో ఉపకరణాలు పంపిణీ చేయనున్నామని సమగ్ర శిక్ష ఏపీసీ డాక్టర్ రామారావు తెలిపారు. శుక్రవారం ఆయన జిల్లా కేంద్రానికి వచ్చిన ఉపకరణాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతేఏడాది ఏప్రిల్‌లో జీరో నుంచి 18 ఏళ్ల వయసు కలిగిన దివ్యాంగులు విద్యార్థుల కోసం వైద్య శిబిరాలను నిర్వహించామన్నారు. 693 విద్యార్థులను పరీక్షించి 482 మందికి ఉపకరణాలు అవసరమని గుర్తించామన్నారు. అందులో 377 మందికి వీల్ ఛైర్లు, వినికిడి యంత్రాలు, కర్రలు తదితర పరికరాలను అందజేస్తున్నట్టు ఆయన తెలిపారు.

చీపురుపల్లిలో యోగాంధ్ర ర్యాలీ


పట్టణంలో నిర్వహిస్తున్న ర్యాలీ

చీపురుపల్లి, మే 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో శుక్రవారం యోగాంధ్ర కార్యక్రమంపై ర్యాలీ నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ మెయిన్ రోడ్డు మీదుగా సాగి గాంధీ బొమ్మ వద్ద ముగిసింది. ర్యాలీలో డివిజనల్ అభివృద్ధి అధికారి హేమసుందర్, ఎంపీడీవో ఎల్.త్రినాథ్, తహసీల్దారు ఎన్.రాజారావు, ఈవోపీఆర్‌డీ ఇప్పలవలస సురేష్‌కుమార్, మండల పరిషత్ ఏవో ప్రవీణ్, ఏపీఎం ఎన్.అప్పలనాయుడు పాల్గొన్నారు.


రాజాంలో యోగా శిక్షణ..

●రాజాం: యోగాతో మానసిక ప్రశాంతత కలుగుతుందని యోగా ట్రైనీ శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం స్థానిక మార్కెట్ కమిటీ ఆవరణలో మండల స్థాయి యోగా టీవోటీలకు నాలుగో రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కిరణ్, అప్పలనాయుడు, ఎంపీడీవో శ్రీనివాసరావు, పెంకి చైతన్యకుమార్ పాల్గొన్నారు. అలాగే స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డు సచివాలయాల్లో అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శిక్షణతరగతులు నిర్వహిస్తున్నారు. యోగా శిక్షకుడు టీటీవీ రమణమూర్తి శిక్షణను ఇస్తున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రామప్పలనాయుడు, ఏఈ పొన్నాడ వెంకటరామరాజు పాల్గొన్నారు.

●గుర్ల: యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని పెద్దఎత్తున కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు ఎంపీడీవో శేషుబాబు తెలిపారు.కార్యక్రమంలో మండల అధికారులు, ప్రజాప్రతినిధులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

●గరివిడి: స్థానిక డిగ్రీ కళాశాలలో యోగాంధ్రను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా యోగా వల్ల కలిగే ప్రయోజనాలను ఎంపీడీవో సుబ్రహ్మణ్యం వివరించారు. అనంతరం గరివిడిలో ర్యాలీ చేపట్టారు.

మెరుగైన సేవలు అందించండి

భోగాపురం, మే30(ఆంధ్రజ్యోతి): రేషన్ లబ్ధిదారులకు డీలర్లు మెరుగైన సేవలు అందించాలని సీఎస్ డీటీ బి.వి.మురళీ సూచించారు. స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో శుక్రవారం డీలర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీలర్లకు పలు సూచనలు చేశారు. జూన్ 1 నుంచి చౌక ధరల డిపోల్లోనే కార్డు లబ్ధిదారులకు సరుకులు అందించేందుకు అందరూ సిద్ధంగా ఉండాలని ఆయన ఆదేశించారు.

ప్రజా సమస్యలు పరిష్కరించండి

●మంత్రి కొండపల్లి శ్రీనివాస్


అధికారులతో మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్

గజపతినగరం, మే30 (ఆంధ్రజ్యోతి) గ్రామస్థాయిలో ప్రజా సమస్యలను గుర్తించి వాటిని పూర్తిస్థాయిలో అధికారులు పరిష్కరించాలని సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయన మండల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌కు రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు పూర్తిస్థాయిలో అందజేయాలన్నారు. డ్రాగన్ ఫ్రూట్ సాగుకు రైతులకు గతంలో ఎకరాకు రూ.30 వేలు ప్రభుత్వం అందజేసూదన్నారు. ప్రస్తుతం ఏడాదికి రూ.2.70 లక్షలను అందజేస్తున్నామన్నారు. పంటను ప్రభుత్వమే కొనుగోలు చేసే దిశగా చర్యలు తీసుకోనున్నామన్నారు. అలాగే ఆయిల్ పామ్ సాగుకు సంబంధించి మూడేళ్ల కాలపరిమితిపై ప్రభుత్వమే లీజుకు తీసుకుని డ్రిప్ ఇరిగేషన్‌పై 90 శాతం రాయితీ అందిస్తోందన్నారు. అలాగే ఉపాధి హామీ పథకంలో వేతనదారులను పెంచాలని సూచించారు. పనులకు రూ.15 కోట్లు మంజూరు రూ.6 కోట్ల విలువైన పనులు జరిగాయన్నారు. మిగిలిన పనుల పూర్తికి అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఇరిగేషన్‌కు పనులకు గానూ మండలానికి రూ.50 లక్షలు మంజూరయ్యాయన్నారు. ఎం.ఎస్.చానల్, బి.వి.చానల్‌కు రూ.30 లక్షలతో మరమ్మతులకు అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. అలాగే పట్టువాడ వద్ద బి.వి.చానల్ వాల్ నిర్మాణానికి రూ.90 లక్షల వరకు ప్రతిపాదనలు చేశామన్నారు. గ్రామాల్లో పారిశుధ్య పనులు మెరుగుపర్చాలన్నారు. మెంటాడ రోడ్డులో ఆక్రమణల వల్ల కల్వర్టులు మూసుకుపోయాయని, దానిపై అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం మండలంలోని లోగిసలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో మంత్రి శ్రీనివాస్ పలు వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో ఈఆర్‌వో ప్రమీలాగాంధీ, మండల ప్రత్యేక అధికారి ఎం.రమేశ్, ఎంపీడీవో బి.కల్యాణి, తహసీల్దార్ బి.రత్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఈ కమిషనర్ మాకొద్దు

●నెల్లిమర్ల కౌన్సిల్ తీర్మానం ●లంచాలు గుంజుతున్నారని ఆరోపణ


కమిషనర్ తీరుపై మండిపడుతున్న కౌన్సిలర్లు

నెల్లిమర్ల, మే 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక నగర పంచాయతీ కమిషనర్ తారక్‌నాథ్ మాకొద్దు అని కౌన్సిల్‌లో సభ్యులు తీర్మానం చేశారు. శుక్రవారం నెల్లిమర్ల నగర పంచాయతీ కార్యాలయంలో ఛైర్‌పర్సన్ బంగారు సరోజిని అధ్యక్షతన సాధారణ సమావేశం నిర్వహించారు. సమావేశంలో పలు అంశాలు చర్చకు రాగా ప్రధానంగా కమిషనర్ తారక్‌నాథ్ తీరుపై టీడీపీ, వైసీపీ సభ్యులు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఈ కమిషనర్ మాకొద్దు అంటూ వైసీపీ, టీడీపీ సభ్యులు తీర్మానానికి ప్రతిపాదన చేయగా అందుకు ఛైర్‌పర్సన్ బంగారు సరోజిని ఏకీభవించారు. అయితే ఆ ప్రతిపాదనను జనసేన, బీజేపీకి చెందిన ఇద్దరు కౌన్సిలర్లు వ్యతిరేకించారు. కమిషనర్ నేరుగా లంచాలు స్వీకరిస్తున్నారని అందుకు సంబంధించిన పూర్తి ఆధారాలు ఉన్నాయని టీడీపీకి చెందిన 6వ వార్డు కౌన్సిలర్ లెంక హైమావతి భర్త లెంక అప్పలనాయుడు ఆరోపించారు. అన్నీ సక్రమంగా ఉన్నా ఇళ్లు కట్టుకునే వారికి కమిషనర్ అడ్డంకులు సృష్టిస్తున్నారన్నారు. కార్యాలయానికి పిలిపించి లంచాలు గుంజుతున్నారని ధ్వజమెత్తారు. సుమారు 30 మంది నుంచి ఆయన లంచాలు తీసుకున్నారని టీడీపీ సభ్యులు ఆరోపించారు. లంచాల బాధితులు సైతం సమావేశానికి వచ్చి చెప్పారన్నారు. ఇలాంటి కమిషనర్‌ను గతంలో ఎన్నడూ చూడలేదన్నారు. వైసీపీ నేత, కో-ఆప్షన్ సభ్యుడు చిక్కాల సాంబశివరావు మాట్లాడుతూ కమిషనర్ కార్యాలయం నుంచి విధులు నిర్వర్తించాలా గానీ ఎందుకు తరచూ క్షేత్రస్థాయి పర్యటనలు చేస్తున్నారని ప్రశ్నించారు. వార్డుల్లో పర్యటించినా సంబంధిత కౌన్సిలర్లకు కనీస సమాచారం ఇవ్వడం లేదన్నారు. అభివృద్ధి పనులపై కౌన్సిలర్లను కనీస సంప్రదించడం లేదని ఆరోపించారు. కమిషనర్ వద్దంటూ చేసిన తీర్మానాన్ని కలెక్టర్‌కు పంపించనున్నట్టు ఛైర్‌పర్సన్ సరోజిని తెలిపారు. సమావేశంలో వైస్ ఛైర్మన్‌లు సముద్రపు రామారావు, కారుకొండ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులు పూర్తిచేయండి


మాట్లాడుతున్న ఆర్డీ రవీంద్ర

రాజాం, మే30 (ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపాలిటీ పరిధిలో పెండింగ్ పనులను సకాలంలో పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ విశాఖ రీజినల్ డైరెక్టర్ డి.రవీంద్ర అధికారులను ఆదేశించారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో అధికారులు, సిబ్బందితో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలో జరుగుతున్న డ్రైనేజీలు, సీసీ రోడ్డు పనుల పూర్తికి ఇంజనీరింగ్ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. పారిశుధ్య పనులు సక్రమంగా నిర్వర్తించే చర్యలు తీసుకోవాలని కమిషనర్ రామప్పలనాయుడును ఆదేశించారు. పారిశుధ్య పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. యోగాంధ్రను పక్కాగా నిర్వహించాలన్నారు. ఇంటి పన్ను వసూళ్ల జాప్యం తగదన్నారు. తాగునీటి కుళాయిలకు సంబంధించిన మొండి బకాయిలు వసూలు చేయాలన్నారు. సమావేశంలో మున్సిపల్ మేనేజరు శ్రీనివాసరావు, టీపీవో, ఆర్ఐ తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు పెరిగేలా చూడండి

భోగాపురం, మే30(ఆంధ్రజ్యోతి): ఉపాధి వేతనాలు పెరిగేలా శ్రామికులకు పని కల్పించాలని ఏపీడీ పి.పద్మజ అన్నారు. మండలంలోని చాకివలసలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆమె శుక్రవారం పరిశీలించారు. పనిదినాలు, వేతనాలు పెరిగేలా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా మస్తర్లు సరిచూశారు. నిరంతరం పనులు పరిశీలించాలని ఆమె సూచించారు. ఆమెతో పాటు సీఈ శివప్రసాద్, టీఏ రమణ తదితరులున్నారు.

బావిలో గుర్తుతెలియని మృతదేహం


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ

రామభద్రపురం, మే 30 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఆరికతోటలో జాతీయ రహదారి పక్కన నేలబావిలో గుర్తుతెలియని మృతదేహాన్ని పోలీసులు శుక్రవారం గుర్తించారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆరికతోట గ్రామానికి చెందిన కడియాల లక్ష్మి పొలాన్ని అదే గ్రామానికి చెందిన యువకుడు చిట్టి.. కౌలుకు సాగు చేస్తున్నాడు. శుక్రవారం పొలం పనుల నిమిత్తం వెళ్లిన ఆయనకు బావిలో మృతదేహం తేలియాడుతూ కనిపించింది. దీంతో పోలీసులకు సమాచారం అందజేశాడు. వెంటనే ఎస్ఐ ప్రసాదరావు ఘటనా స్థలికి చేరకుని బావిలో ఉన్న మృతదేహాన్ని బయటకు తీయించారు. మృతుడు ఎర్రని గళ్ల చొక్కా, గోధుమ రంగు ఫ్యాంటు ధరించి ఉన్నాడన్నారు. ఎక్కడో చంపి, ఇక్కడకు తీసుకువచ్చి బావిలో పడవేశారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీన్ని హత్యగానే భావిస్తున్నారు. సమాచారం తెలుసుకున్న బొబ్బిలి డీఎస్పీ భవ్యారెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఎస్ఐతో చర్చించారు. విజయనగరం నుంచి క్లూస్‌టీంను రప్పించాలని సూచించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాడంగి సీహెచ్‌సీకి తరలించారు.

వివాహిత ఆత్మహత్య

కొత్తూరు, మే 30(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం జిల్లా కొత్తూరు మండలం మహర్తాపురంలో శుక్రవారం వివాహిత నిమ్మక ప్రవల్లిక (26) ఆత్మహత్యకు చేసుకుందని సీఐ సీహెచ్.ప్రసాద్, ఎస్ఐ అమీర్ అలీ తెలిపారు. ఆ వివరాలిలా ఉన్నాయి. పార్వతీపురం మన్యం జిల్లా గుమ్మలక్ష్మీపురం మండలం కేదారపురం గ్రామానికి చెందిన నిమ్మక ప్రవల్లికకు భామిని మండలం వడ్డంగి గ్రామానికి చెందిన నిమ్మక సురేష్‌కుమార్‌తో నాలుగున్నరేళ్ల కిందట వివాహమైంది. వీరి మధ్య గతంలో తగాదాలు చోటు చేసుకోవడంతో బత్తిలి, గుమ్మలక్ష్మీపురం పోలీసు స్టేషన్‌లలో ఫిర్యాదులున్నాయి. పెద్దలు వారి మధ్య సయోధ్య కుదిర్చారు. బతుకు దెరువు కోసం ప్రైవేట్ సెల్‌టవర్ కంపెనీలో పనిచేస్తూ కొత్తూరు మండలం మహర్తాపురంలో ఆరు నెలలుగా అద్దె ఇంటిలో నివసిస్తున్నారు. అయితే ఏం జరిగిందో తెలియదు కాని ప్రవల్లిక శుక్రవారం ఇంటి లోనే ఫ్యాన్‌కు ఉరి వేసుకుంది. మృతురాలి భర్త సురేష్‌కుమార్ సమాచారంతో సీఐ సీహెచ్.ప్రసాద్, ఎస్ఐ అమీర్ అలీ ఘటనా స్థలానికి చేరుకుని ఆత్మహత్యకు కారణాలపై ఆరా తీశారు. ప్రవల్లిక తల్లిదండ్రులకు సమాచారం అందించారు. అయితే భార్యాభర్తల మధ్య నిత్యం గొడవలు జరిగేవంటూ ప్రవల్లిక మృతిపై స్థానికు లు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మృతురాలి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. క్లూస్ టీమ్‌ను రప్పిస్తున్నట్లు తెలిపారు.

ఆలయంలో చోరీ

భోగాపురం, మే30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడివాడలో తోగాలమ్మ ఆలయంలో గురువారం రాత్రి చోరీ జరిగింది. ఆలయంలో హుండీ అపహరణకు గురైంది. హుండీలో రూ.15 వేల వరకూ నగదు ఉండవచ్చని భావిస్తున్నారు. అదే గ్రామానికి చెందిన దుంప సీతారాముడు చోరీ విషయం ఫిర్యాదు చేశారని ఎస్ఐ వి.పాపారావు తెలిపారు. ఫిర్యాదు ఆధారంగా సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించామన్నారు. భీమిలి మండలం చిప్పాడకు చెందిన ఓ వ్యక్తిని అనుమానితుడిగా భావించి విచారిస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

యంత్ర పరికరాల సరఫరాకు టెండర్లు

సీతంపేట రూరల్, మే 30(ఆంధ్రజ్యోతి): సీతంపేట ఐటీడీఏ పరిధిలో నిర్వహిస్తున్న వీడీవీకే(వన్‌ధన్ వికాస్ కేంద్రాలు)ల్లో యంత్ర పరికరాల సరఫరాకు సంబంధించి శుక్రవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో టెండర్లు నిర్వహించారు. ఐటీడీఏ పీవో సి.యశ్వంత్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వ హించిన ఈ టెండర్ల ప్రక్రియలో ఏడుగురు టెండర్‌దారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా టెండర్లు దక్కిం చుకున్న వారిని ఉద్దేశించి పీవో మాట్లాడుతూ వీడీవీకేలకు యంత్ర పరికరాలను సకాలంలో పంపిణీ చేయాలని పీవో సూచించారు. టెండర్ల నిర్వహణలో ఏపీవో జి.చిన్నబాబు, పీహెచ్‌వో ఆర్‌వీ గణేష్, డీపీఎం రవి, సిబ్బంది పాల్గొన్నారు.

రామతీర్థంలో పునర్వసు నక్షత్ర పూజలు

నెల్లిమర్ల, మే 30 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం రామస్వామి వారి దేవస్థానంలో శ్రీరాముని జన్మ నక్షత్రం పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకుని శుక్రవారం పంచామృత అభిషేకం, పట్టాభిషేకాన్ని అర్చకులు నిర్వహించారు. మే 3న పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకుని 27 రోజుల పాటు శ్రీమద్రామాయణ పారాయణ నిర్వహించారు. పట్టాభిషేకం అనంతరం శ్రీరామచంద్రస్వామి వారిని పూలతో అలంకరించారు. ఈ కార్యక్రమాలను దేవస్థానం ఈఓ వై.శ్రీనివాసరావు పర్యవేక్షించారు. అర్చకులు ఖండవిల్లి సాయిరామాచార్యులు, కిరణ్‌కుమార్, గొడవర్తి నరసింహాచార్యులు, పాణంగిపల్లి ప్రసాద్, పవన్ కుమార్, రామ్‌గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా వెంకటరావు

విజయనగరం దాసన్నపేట, మే 30 (ఆంధ్రజ్యోతి): బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా గదుల వెంకటరావును నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు మంగళగిరిలోని రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం నియామక పత్రాన్ని అందజేశారు. నూతనంగా ఎన్నికైన గదుల వెంకటరావును జిల్లాలోని పలువురు బీసీ నాయకులు అభినందించారు.

అంతా చిత్తడి.. చిత్తడి


కొటారుబిల్లి రైతు బజారు ఆవరణ ఇలా..

గంట్యాడ, మే 30 (ఆంధ్రజ్యోతి): కొటారుబిల్లి రైతు బజారు వర్షానికి చిత్తచిత్తడిగా మారింది. రైతు బజారులోకి అడుగు పెట్టడానికి కొనుగోలుదారులు జంకుతున్నారు. రైతు బజారు ప్రాంగణం బురదమయంగా మారడమే కారణం. మండలంలోని 20 గ్రామాలకు కూడలిగా ఉన్న కొటారుబిల్లిలో ఎనిమిదేళ్ల కిందట రైతు బజారు ఏర్పాటైంది. వాస్తవంగా ఇది పల్లపు ప్రాంతం కావడంతో వర్షం కురిస్తే నీరు నిల్వగా ఉంటోంది.

●రాజాం, మే 30 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి రోడ్డులోని ఎంఎల్‌ఎస్ గోదాం ప్రాంగణం బురదమయంగా తయారైంది. దీంతో రేషన్ సరుకుల కోసం వచ్చిన వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. సుమారు ఆరేళ్ల కిందట రూ.లక్షలు ఖర్చుచేసి గోదాం నిర్మాణం చేపట్టారు. అయితే బీటీ రోడ్డు నుంచి గోదాం వరకూ సరైన రహదారి సౌకర్యం కల్పించ లేదు. వర్షం కురిసే సమయంలో డీలర్లు, సిబ్బందికి అవస్థలు తప్పడంలేదు.


బొబ్బిలి రోడ్డులోని ఎంఎల్‌ఎస్ గోదాం ప్రాంగణం..

పీఎం సూర్యఘర్‌పై దృష్టి సారించాలి

పార్వతీపురం, మే 30 (ఆంధ్రజ్యోతి): పీఎం సూర్యఘర్ లక్ష్యాల సాధనపై దృష్టి సారించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో యోగాంధ్ర, పీఎం సూర్యఘర్, ప్రజల స్పందన తదితర అంశాలపై ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పీఎం సూర్యఘర్ పథకంలో భాగంగా ప్రతి నియోజకవర్గంలో కనీసం పది వేల కనెక్షన్లు ఏర్పాటు చేయడం లక్ష్యంగా చేసుకోవాలన్నారు. జిల్లాలో ఈ పథకం కింద ఇప్పటివరకు 1,266 మంది నమోదు కాగా, 288 కనెక్షన్లు ఇచ్చారని తెలిపారు. అలాగే యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. జూన్ 5న వనం-మనం కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. అనంతరం కలెక్టర్ శ్యాంప్రసాద్ మాట్లాడుతూ నిర్దేశిత లక్ష్యాలు పూర్తి చేయడానికి చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జేసీ శోభిక, డీఆర్వో కె.హేమలత, ఈపీడీసీఎల్ పర్యవేక్షక ఇంజనీర్ కోడా చలపతిరావు, డీఎంహెచ్‌వో ఎస్.భాస్కరరావు, అధికారులు పాల్గొన్నారు.

డ్వాక్రా బజార్ ఏర్పాట్ల పరిశీలన

పార్వతీపురం, మే 30(ఆంధ్రజ్యోతి): పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నాబార్డు ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న అఖిల భారత డ్వాక్రా బజార్‌ను కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ శుక్రవారం పరిశీలించారు. సరస్ మేళా పేరున ఏర్పాటు చేసిన అఖిల భారత డ్వాక్రా బజార్‌లో రాష్ట్రం నలుమూలల నుంచి హస్తకళలు, ఆహార ఉత్పత్తులు, గృహ అలంకరణలు, చేనేత వస్త్రాల ఉత్పాదకాల తయారీదారులు పెద్దఎత్తున పాల్గొంటున్నారు. మేళాలో 60 స్టాల్‌లను ఏర్పాటు చేశారు. ఇప్పలపోలమ్మ, ఎర్రకంచమ్మ దేవతల పండుగ కలిసి రావడంతో మేళాకు మంచి ఆదరణ లభిస్తుందని ఆశిస్తున్నారు. ఈ మేళా జూన్ 4వ తేదీ వరకు సాగుతుంది. డ్వాక్రా మహిళలు, గ్రామీణ చేనేత కళాకారులు తయారుచేసిన ఉత్పత్తులు కావడం గమనార్హం. ఈ కార్యక్రమంలో నాబార్డు జిల్లా అభివృద్ధి అధికారి డి.దినేష్‌కుమర్ రెడ్డి, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎం.సుధారాణి, సహాయ ప్రాజెక్టు అధికారి వై.సత్యం నాయుడు, ఆర్ట్స్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు నూక సన్యాసిరావు పాల్గొన్నారు.

బంగారమ్మపేట పాఠశాలకు కొత్త రూలా?

సాలూరు రూరల్, మే 30 (ఆంధ్రజ్యోతి): ఎంపీయూపీ పాఠశాలలకు వర్తించే నిబంధన కాకుండా సాలూరు మున్సిపల్ పరిధిలో ఉన్న బంగారమ్మపేట ఎస్ఎంయూపీ పాఠశాలకు ప్రత్యేక నిబంధన ఉందా.. అని పీఆర్టీయూ రాష్ట్ర నాయకుడు ఇందుపూరి గున్నరాజు ప్రశ్నించారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎంపీయూపీల్లో యూపీ విభాగంలో 30 మంది విద్యార్థులు దాటితే నలుగురు స్కూల్ అసిస్టెంట్లను కేటాయించారన్నారు. అయితే ఉమ్మడి విజయనగరం జిల్లాలో ఉన్న ఏకైక మున్సిపల్ యూపీ పాఠశాల అయిన బంగారమ్మపేట పాఠశాలకు మాత్రం 36 మంది యూపీ రోల్ ఉన్నా నలుగురు ఎస్జీటీలను కేటాయించడం సరికాదన్నారు. నిబంధనలు ప్రకారం నలుగురు ఎస్ఏలను కేటాయించాలని ఆయన కోరారు. ఇదే విషయమై పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు మిట్టా కృష్ణయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏఎం గిరి ప్రసాద్ ద్వారా పాఠశాల విద్యశాఖ డైరెక్టర్‌కు వినతిపత్రం అందించామని చెప్పారు.

పోలమాంబ ఆలయ హుండీల లెక్కింపు

మక్కువ, మే 30 (ఆంధ్రజ్యోతి): శంబర పోలమాంబ అమ్మవారి చదురుగుడి, వనంగుడి ఆలయాల వద్ద హుండీలను శుక్రవారం తెరిచి లెక్కించారు. చదురుగుడి హుండీల ద్వారా రూ.2లక్షల 34వేల 399రూపాయలు, వనంగుడి హుండీల ద్వారా రూ.లక్షా 65వేల 219 ఆదాయం రాగా, రెండు ఆలయాలకు కలిపి రూ.3 లక్షల 99వేల 618 ఆదాయం వచ్చింది. వచ్చిన ఆదాయం ఈ ఏడాది మార్చి నుంచి మే నెల వరకు సంబంధించిదని ఈవో వీవీ సూర్యనారాయణ తెలిపారు. ఈ కార్య క్రమంలో సాలూరు గ్రూప్ దేవాలయాల కార్యనిర్వాహణాధికారి టి.రమేష్, ఎంపీటీసీ సభ్యుడు తీళ్ల పోలినాయుడు, సర్పంచ్ సింహాచలమ్మ, ఉత్సవ కమిటీ మాజీ చైర్మన్ నైదాన తిరుపతిరావు, పోలీస్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

జంఝావతికి జలహారతి



జలహారతి పడుతున్న నాయకులు

జియ్యమ్మవలస, మే 30 (ఆంధ్రజ్యోతి): కొమరాడ మండలం రాజ్యలక్ష్మీపురం గ్రామ సమీపంలో ఉన్న జంఝావతిలో శుక్రవారం జలహారతి నిర్వహించారు. జంఝావతి ప్రాజెక్టు సాధన సమితి అధ్యక్షుడు చుక్క భాస్కరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో చెరువుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు, జంఝావతి కార్యాచరణ కన్వీనర్ మరిశర్ల మాలతీ కృష్ణమూర్తినాయుడు పాల్గొన్నారు. ఈసందర్భంగా జంఝావతి ప్రాజెక్టు పనులు త్వరగా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. సాధన సమితి గౌరవ సలహాదారు శ్రీభారతనందస్వామిజీ, వర్కింగ్ ప్రెసిడెంట్లు ఎస్.రామారావు, ఈవీ నాయుడు, సీపీఐ, సీపీఐ (ఎంఎల్) లిబరేషన్, గిరిజన సంఘం, ఏపీ రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

ప్రజాపంపిణీ వ్యవస్థ
గాడిలో పడేనా?

(3వ పేజీ తరువాయి)

ఉన్నాయి. ప్రతినెలా సుమారు 4,900 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని కార్డుదారులకు అందిస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇకపై ప్రతి డీలరు తమ డిపో ద్వారా రోజూ ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం నాలుగు నుంచి రాత్రి 8 గంటల వరకు సరుకులు అందించాలి. కార్డుదారులు తమకు అనుకూలంగా ఉన్న ఏ సమయంలోనైనా డిపోకు వెళ్లి రేషన్ సరుకులు తీసుకోవచ్చు. దివ్యాంగులు, 65 ఏళ్లు దాటిన వృద్ధుల ఇళ్లకు వెళ్లి రేషన్ డిపో డీలర్లు నిత్యావ సర సరుకులు అందించాల్సి ఉంది.

డిపోల ద్వారా రేషన్

ప్రభుత్వ ఆదేశాల మేరకు జూన్ ఒకటో తేదీ నుంచి రేషన్ డిపోల ద్వారా కార్డుదారులకు సరుకుల సరఫరా జరగనుంది. ఇన్‌చార్జి డీఎస్‌వోగా డీఆర్‌వో హేమలతకు ఆ బాధ్యతలు అప్పగిస్తున్నాం.

- శ్యామ్‌ప్రసాద్, కలెక్టర్, పార్వతీపురం మన్యం

వరుస దొంగతనాలు

- ఆందోళన చెందుతున్న రాయగడవాసులు

ఒడిశా

రాయగడ, మే 30 (ఆంధ్రజ్యోతి): రాయగడ పట్టణంలో వరుస దొంగతనాలు జరుగుతుండడంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతు న్నారు. న్యూకాలనీ నివాసి, కౌన్సిలర్ ఎ.వాణిశ్రీ ఇంట్లో చోరీ జరిగి వారం రోజులు కాకముందే తాజాగా గురువారం రాత్రి న్యూకాలనీ సాయిమందిర్ రోడ్డు మార్గంలోని సుబ్రత్‌పతి ఇంట్లో భారీ చోరీ జరిగింది. ఈ చోరీకి సంబంధించి పట్టణ పోలీసు థానా అధికారి కమలా కాంత్, బాధితుడు తెలిపిన వివరాల మేరకు.. ఇంటి యజమాని సుబ్రత్ కుటుంబీకులు ముందుఇంటిలో నిద్రించగా దుండగులు ఇంటి వెనక నుంచి తలుపులు పగలగొట్టి ఇంట్లోకి చొరబడ్డారు. మూడు బీరువాలను తెరిచి అందులో ఉంచిన రూ.10లక్షల నగదు, 20 తులాల బంగారం, రెండు కిలోల వెండి దోచుకుపోయారు. ఉదయం లేచి చూసిన యజమాని సుబ్రత్.. చోరీ జరిగినట్టు గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు సాంకేతిక బృందం స్నిఫర్ డాగ్‌తో ఘటనా స్థలానికి చేరుకుని, పరిశీలించారు.

రైతులకు విత్తనాలు సిద్ధం

రాయగడ, మే 30 (ఆంధ్రజ్యోతి): త్వరలో ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో రైతులకు విత్తనాలు, ఎరువులు పంపిణీ చేసేందుకు వ్యవసాయ శాఖాధికారులు సన్నాహాలు ప్రారంభించారు. తొలి విడతగా 11 సమితి కేంద్రాలకు ఒకొక్క సమితి కేంద్రానికి వంద క్వింటాళ్ల చొప్పున వరి విత్తనాలు పంపిణీ చేసినట్టు వ్యవసాయ శాఖాధికారి ప్రజ్ఞదాస్ తెలిపారు. ఈ ఏడాది 40వేల హెక్టార్లలో వరి పండించనున్నారని, దీనిఅనుగుణంగా 6,500 క్వింటాళ్ల వరి విత్తనాలు సిద్ధంగా ఉంచామని వెల్లడించారు.

పూడిక తొలగించక అవస్థలు

- పలుచోట్ల భారీ వర్షం
- పాలకొండలో రహదారిపైకి మురుగు

పాలకొండ, మే 30(ఆంధ్రజ్యోతి): వర్షం కురిస్తే చాలు పాలకొండ పట్టణ పౌరుల అవస్థలు వర్ణణా తీతం. దశాబ్దాల కిందట నిర్మించిన మురుగు కాలువలు కావడం, ఎప్పటికప్పుడు పూడికలు తీయకపోవడంతో చిన్నపాటి వర్షం కురిసినా మురుగునీరు రోడ్డుపైకి ప్రవహిస్తుంది. దీంతో పట్టణవాసులు ఇబ్బందులకు గురవుతున్నారు. శుక్రవారం కురిసిన వర్షానికి గారమ్మకాలనీ, ఎస్ఎస్ఎన్ కాలనీ, రావాడవీధి, గొల్లవీధి, కస్పా వీధి, గాయత్రీనగర్ కాలనీ తదితర కాలనీల్లో ప్రధాన రహదారిపైనే మురుగునీరు ప్రవహించింది. అలాగే పంచాయతీ రాజ్ కార్యాలయం, ఆర్‌అండ్‌బీ బంగ్లా ప్రాంగణంతో పాటు పలు ప్రభుత్వ కార్యాలయా ల్లోనూ వర్షపు నిలిచిపోయింది. నగర పంచాయతీ అధికారులు రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని కాలువల్లో పూడికలు తొలగించాలని పట్టణవాసులు కోరుతున్నారు.



రావాడవీధిలో రహదారిపై ప్రవహిస్తున్న మురుగునీరు



డ్రైనేజీ వ్యవస్థ లేక..

మక్కువ, మే 30 (ఆంధ్రజ్యోతి): మండలంలో శుక్రవారం మధ్యాహ్నం ఈదురుగాలులు, ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. వర్షం వల్ల కొన్ని చోట్ల చెట్లు నేలకొరిగాయి. స్థానిక ప్రధాన రహదారికి ఇరువైపులా డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగునీరు రోడ్లుపై ప్రవహించింది. దీంతో వాహన చోదకులు, పాదచారులు అవస్థలు పడ్డారు. అకాల వర్షంతో చిరు దుకాణాల వ్యాపారులు బయట ఉంచి తమ సరుకులు కాపాడుకునేందుకు అగచాట్లు పడ్డారు. ● గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలోని పరిసర ప్రాంతాల్లోని శుక్రవారం సాయంత్రం భారీ వర్షం పడింది. ప్రధాన రహదారులన్నీ జలమయం అయ్యాయి.

మక్కువలో ప్రధాన రహదారిపై ప్రవహిస్తున్న మురుగునీరు

అమ్మవార్ల పండుగల్లో లోటుపాట్లు రాకూడదు

- ఎమ్మెల్యే విజయచంద్ర

పార్వతీపురం రూరల్, మే 30 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురంలో మూడేళ్ల తర్వాత నిర్వహిస్తున్న ఇప్పలపోలమ్మ, ఎర్రకంచమ్మ, బంగారమ్మ పండగల్లో ఎలాంటి లోటుపాట్లు రాకుండా చూడాలని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అధికారులను ఆదేశించారు. శుక్రవారం పార్వతీపురంలోని తన క్యాంప్ కార్యాల యంలో ఆయన మున్సిపల్ శాఖ, పోలీస్ శాఖ, విద్యుత్ శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. జూన్ 1, 2, 3 తేదీల్లో జరిగే అమ్మవార్ల పండుగల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బంది రాకుండా ముందస్తు జా గ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, తాగునీరు సరిపడగా సరఫరా చేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. శాంతిభద్రతలు, ట్రాఫిక్ సమస్యలు లేకుం డా చూడాలని పోలీసులకు సూచించారు. పండగలో విద్యుత్ సరఫరాకు ఎలాంటి ఆటంకం లేకుండా చూడాలని, సిరిమాను తిరిగే సమయంలో ప్రమాదాలకు ఆస్కారం లేకుండా చర్యలు చేపట్టాలని విద్యుత్ శాఖాధికారులకు నిర్దేశించారు. అవసరమైన మేరకు సిబ్బందిని అదనంగా నియమించి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఎమ్మెల్యే మార్గనిర్దేశం చేశారు. అనంతరం డీఎంహెచ్‌వో భాస్కరరావు, వైద్య శాఖ అధికారులతో ఎమ్మెల్యే సమీక్షించారు. వైద్య శిబిరాలు నిర్వహించాలని, మందులు, అంబులెన్స్‌లు అందుబాటులో ఉంచాలని సూచించారు.



అధికారులకు సూచనలు చేస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

పర్యవేక్షణ లేదు.. నిర్వహణ నిల్!

(3వ పేజీ తరువాయి)

సాగునీరందేలా డిజైన్ చేశారు. ఎడమ ప్రధాన కాలువ పొడవు 37.6 కిలో మీటర్లు. ఇది గరుగుబిల్లి మండలం తోటపల్లి నుంచి పాలకొండ మండలం ఊనిగెడ్డ వరకు ఉంది. దీని ద్వారా 32 వేల ఎకరాకలు సాగునీరందుతుంది. పాత కుడి ప్రధాన కాలువ పొడవు 17 కిలో మీటర్లు. ఇది విజయనగరం జిల్లా వంగర మండల కేంద్రం వరకు ఉంది. దీని ద్వారా 8 వేల ఎకరాలకు సాగునీరందేలా గతంలో డిజైన్ చేశారు. అయితే ఈ రెండు ప్రధాన కాలువల నిర్వహణకు 30 మంది సిబ్బంది అవసరం. కాగా నూతనంగా నిర్మించిన మరో కుడి కాలువ పొడవు 117.89 కిలో మీటర్లు. 48 కిలో మీటర్ల వరకు మాత్రమే తోటపల్లి (నాగావళి) నీటి పారుదలశాఖ కాలువను పర్యవేక్షిస్తుంది. మిగిలిన 69.89 కిలో మీటర్ల మేర కాలువను విజయనగరం జిల్లా రాజాం నీటి పారుదలశాఖ పర్యవేక్షణ చేస్తోంది. తోటపల్లి పర్యవేక్షణలో ఉన్న 48 కిలో మీటర్ల కాలువలో 9 డిస్ట్రిబ్యూటరీలు ఉన్నాయి. వాటి ద్వారా 20,521 ఎకరాలకు సాగునీరందించాల్సి ఉండగా, ప్రస్తుతం కేవలం 9,200 ఎకరాలకు మాత్రమే నీరందుతుంది. పూర్తిస్థాయిలో కాలువ నిర్మాణం జరగకపోవడమే ఇందుకు కారణం. తోటపల్లి ప్రాజెక్టుకు మొత్తం 78 మంది సిబ్బంది అంటే లస్కర్లు, మజ్దూర్‌లు, ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, వెల్డర్, హెల్పర్లు అవసరం. కానీ పాత రెగ్యులేటర్ పరిధిలో 30 మందికి ఆరుగురే పనిచేస్తున్నారు. ఇంకా 72 మంది అవసరం

జంఝావతి..

కొమరాడ మండలం రాజ్యలక్ష్మీపురం గ్రామ సమీపంలో ఉంది ఈ ప్రాజెక్టు. రాజ్యలక్ష్మీపురం నుంచి పార్వతీపురం మండలం గుచ్చిమి వరకు 26.92 కిలో మీటర్లు మేర ఎడమ కాలువ ఉంది. దీని ద్వారా 12,320 ఎకరాలకు సాగునీరందుతుంది. రాజ్యలక్ష్మీపురం నుంచి బొండపల్లి, తాళ్లబురిడి గ్రామాల వరకు 27 కిలో మీటర్ల మేర కుడి కాలువఉంది. దీని ద్వారా కూడా 12,320 ఎకరాలకు సాగునీరందుతుంది. ఈ రెండు కాలువల ద్వారా పార్వతీపురం, కొమరాడ మండలాల్లో మొత్తం 24,640 ఎకరాలకు సాగునీరందుతుంది. వీటి నిర్వహణ, కాలువల పర్యవేక్షణకు మొత్తం 30 మంది వరకు సిబ్బంది అవసరం. అయితే ప్రస్తుతం ముగ్గురు లస్కర్లే ఉన్నారు. వారిలో వచ్చే నెలలో ఇద్దరు రిటైర్ కాబోతున్నారు.

వట్టిగెడ్డ..

జియ్యమ్మవలస మండలం తాళ్లడుమ్మ పంచాయతీ రావాడ వద్ద వట్టిగెడ్డ రిజర్వాయర్ ఉంది. దీని కుడి ప్రధాన కాలువ పొడవు 9.756 కిలో మీటర్లు . దీని ద్వారా 13 వేల ఎకరాలకు సాగునీరందేలా డిజైన్ చేశారు. ఎడమ ప్రధాన కాలువ పొడవు 8 కిలో మీటర్లు కాగా దీని ద్వారా 3,680 ఎకరాలకు సాగునీరందుతుంది. ఈ ప్రాజెక్టుకు 23 మంది లస్కర్లు ఉండాలి. కానీ ఒక్కరే ఉన్నారు. హెల్పర్లు నలుగురు ఉండాలి కానీ ఇద్దరే ఉన్నారు. ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, వర్క్ఇన్‌స్పెక్టరు లేరు. వాచ్‌మెన్‌లు ముగ్గురు ఉండాలి. కానీ ఒక్కరు కూడా లేరు. ఇప్పటికే కాలువ గట్లు కబ్జాకు గురయ్యాయి. కొందరు కాలువల మధ్యలో దొంగ మదుములు ఏర్పాటు చేయడంతో శివారు భూములకు నీరందడం లేదు.

పెద్దగెడ్డ..

పెద్దగెడ్డ ద్వారా మన్యం జిల్లాలో పాచిపెంట, సాలూరు మండలాలతో పాటు విజయనగరం జిల్లా రామభద్రపురం మండలంలో 12 వేల ఎకరాలకు సాగునీరందుతుంది. ఈ ప్రాజెక్టులో వేగావతి లెఫ్ట్ మెయిన్ కాలువ (వీఎల్ఎంసీ) పొడవు 7.34 కిలో మీటర్లు. దీని ద్వారా 3,600 ఎకరాలకు సాగునీరందుతుంది. వేగావతి కుడి ప్రధాన కాలువ (వీఆర్ఎంసీ) పొడవు 10.4 కిలో మీటర్లు. దీని ద్వారా 800 ఎకరాలకు సాగునీరందుతుంది. ఆ రెండే కాకుండా పెద్దగెడ్డ కుడి ప్రధాన కాలువ 18 కిలో మీటర్ల మేర ఉండగా.. దాని ద్వారా 7,600 ఎకరాలకు సాగు నీరందుతుంది. ఈ ప్రాజెక్టు పరిధిలో 16 మంది లస్కర్లతో పాటు మొత్తం 30 మంది వరకు సిబ్బంది అవసరం. కానీ ఎవరూ లేక అంతా ఇంజనీరే చూస్తున్నారు.

పెదంకలాం..

ఇది కేవలం ఆనకట్ట. దీని కాలువ పొడవు 25 కిలో మీటర్లు. దీని ద్వారా మన్యం జిల్లాలో బలిజిపేట మండలానికి 6,617.16 ఎకరాలు, విజయనగరం జిల్లా వంగర మండలంలో 1,636.31 ఎకరాలకు సాగునీరందుతుంది. ఇక్కడ కూడా 11 మంది లస్కర్లతో పాటు ఇతర సిబ్బంది అవసరం. కానీ ఇక్కడ ఎవరూ లేరు. ఇంకొక దయనీయ విషయం ఏమిటంటే పెద్దగెడ్డ ప్రాజెక్టు, పెదంకలాం ఆనకట్టకు ఒక్కరే ఏఈ ఉండడం గమనార్హం.

వెంగళరాయసాగర్..

ఈ ప్రాజెక్టు ద్వారా మన్యం జిల్లాలోని మక్కువ మండలంలో 14,550 ఎకరాలకు, సీతానగరం మండలంలో 3,723 ఎకరాలు, విజయనగరం జిల్లా బొబ్బిలి మండలంలో 6,427 ఎకరాలు సాగునీరందుతుంది. దీని ఎడమ కాలువ పొడవు 0.2 కిలో మీటర్లు. అయితే దాని పరిధిలో రెండు కాలువలు ఉన్నాయి. అందులో ఒక దాని పొడవు పది కిలో మీటర్లు. దీని ద్వారా 880 ఎకరాలకు సాగునీరందుతుంది. ఇంకొక కాలువ పొడవు 8.8 కిలో మీటర్లు. దాని ద్వారా 7,640 ఎకరాలకు సాగునీరందుతుంది. ఇక కుడి ప్రధాన కాలువ పొడవు 18.7 కిలో మీటర్లు కాగా దీని ద్వారా 16,180 ఎకరాలకు సాగునీరందుతుంది. అయితే ఈ ప్రాజెక్టుకు 45 మంది వరకు సిబ్బంది అవసరం. కానీ ఇద్దరు మెన్ మజ్దూర్‌లు మాత్రమే ఉన్నారు. ప్రాజెక్టుల పరిధిలో కావల్సిన సిబ్బంది కోసం ప్రభుత్వానికి నివేదించామని మరోవైపు ఇంజనీర్లు చెబుతున్నారు.

తోటపల్లి నిర్వహణకు రూ.36 లక్షలు..

పార్వతీపురం, మే 30 (ఆంధ్రజ్యోతి): తోటపల్లి పాత రెగ్యులేటర్ ఎడమ కాలువల పర్యవేక్షణ, నిర్వహణ, పాలకొండ, వీరఘట్టం, గరుగుబిల్లి మండలాల పరిధిలో ఎస్‌డీఎంఎఫ్ పనుల కోసం రూ.36.70 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసిందని నీటిపారుదలశాఖ సహాయ ఇంజనీర్ డి.వెంకటరమణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్‌డీ ఎంఎఫ్ పనులను ఈ-ప్రొక్యూర్మెంట్ ప్లాట్ ఫార్మ్‌లో ఆన్‌లైన్ టెండరు విధానంలో కాంట్రాక్టర్లకు అప్పగించామన్నారు. పదింటిలో ఆరు పనులు క్వాలిటీ కంట్రోల్ అధికారుల పరిశీలనలో పూర్తయినట్లు వెల్లడించారు. వాటి అగ్రిమెంట్ విలువ రూ.9.42 లక్షలని తెలిపారు. బిల్లులను చెల్లించాల్సి ఉందన్నారు.

2న జూనియర్ కళాశాలల పునఃప్రారంభం

(3వ పేజీ తరువాయి)

మొదటి సంవత్సరం విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేస్తామని తెలిపారు. ఇప్పటికే ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశామన్నారు. ఆ రోజు నుంచే కళాశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తామని వెల్లడించారు. లెక్చరర్లు, బోధనేతర సిబ్బంది విధిగా సమయపాలన పాటించాలని ఆదేశించారు.

విద్యాప్రమాణాల పెంపే లక్ష్యం

పార్వతీపురం టౌన్, మే 30(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కళాశాలల్లో విద్యాప్రమాణాలతో పాటు ఉత్తీర్ణత శాతం పెంచడమే లక్ష్యంగా పనిచేయాలని డీఐఈవో నాగేశ్వర రావు ఆదేశించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆయన్ని పట్టణంలో శుక్రవారం జిల్లా ప్రభుత్వ జూని యర్ కళాశాలల అధ్యాపక సంఘ సభ్యులు ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అధ్యా పకుడిగానే కాకుండా ప్రిన్సిపాల్‌గా పనిచేసిన అనుభ వం తనకుందని తెలిపారు. డీఐఈవోగా తన బాధ్యతల ను సమర్థవంతంగా నిర్వహించేందుకు కృషి చేస్తా నని అన్నారు. ఈ ఏడాది నుంచి ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థుల ప్రవేశాలను పెంచే విధంగా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు వెల్లడించారు. అధ్యాపకుల సహాయ సహకారా లతో విద్యార్థులకు ఉత్తమ బోధన అందిస్తామన్నారు.

ఘనంగా సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం

పాలకొండ, మే 30 (ఆంధ్రజ్యోతి): సీఐటీ యూ ఆవిర్భావ దినోత్సవాన్ని పాలకొండలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి కాద రాము తదితరులు పాల్గొన్నారు.

ఏకలవ్యలో సీట్లుకు కౌన్సెలింగ్

భామిని, మే 30 (ఆంధ్రజ్యోతి): భామిని లోని ఏకలవ్య గురుకుల పాఠశాలలో మిగు లు సీట్లుకు శుక్రవారం విద్యార్థులకు కౌన్సె లింగ్ నిర్వహించినట్టు పాఠశాల ప్రిన్సిపాల్ గంగాధర్ తెలిపారు. ఇంటర్ బైపీసీ, ఎంపీసీ, హెచ్‌ఈహెచ్ కోర్సులకు 38 ఖాళీగా ఉండగా, ఆన్‌లైన్‌లో 66 దరఖాస్తులు వచ్చాయన్నారు. దీనిపై 38 మంది విద్యార్థులకు మెరిట్ ప్రాతి పదికన ఎంపికలు చేశారు. విద్యార్థుల సర్టిఫికెట్లు, మార్క్స్ మెమోలు పరిశీలించారు.



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న దృశ్యం

ఐటీడీఏ వేదికగా పీవోల కాన్ఫరెన్స్

- 3న సమావేశం

సీతంపేట రూరల్, మే 30(ఆంధ్రజ్యోతి): గిరిజనుల అభివృద్ధే లక్ష్యంగా వివిధ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న కూటమి ప్రభుత్వం నూతన సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. దీనిలో భాగంగా ప్రతినెల మొదటి వారంలో రాష్ట్రంలో ఉన్న ఒక్కో ఐటీడీఏల్లో పీవోల కాన్ఫరెన్స్ నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధం అవుతోంది. దీనికిగాను మొట్టమొదట నిర్వహించే ఐటీడీఏ పీవోల ప్రత్యేక సమావేశానికి సీతంపేట ఐటీడీఏ వేదిక కానుంది. ఈ సమావేశం జూన్ 3వ తేదీన నిర్వహించాలని ఇప్పటికే ప్రభుత్వం నుంచి సీతంపేట ఐటీడీఏ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు వచ్చాయి. దీనిపై పీవోల కాన్ఫరెన్స్ కోసం ఐటీడీఏ అధికారులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు.

న్యూస్ బాక్స్

వసతిగృహాల్లో స్ప్రేయింగ్

సీతంపేట రూరల్, మే 30(ఆంధ్రజ్యోతి): సీతంపేట ఐటీడీఏ పరిధిలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ, గురుకుల వసతిగృహాల్లో వచ్చే నెల 2వ తేదీ నుంచి 11వ తేదీ వరకు యాంటీ మలేరియా మందు(ఐఆర్ఎస్) స్ప్రేయింగ్ చేయనున్నట్లు మలేరియా సబ్ యూనిట్ అధికారి జె.మోహనరావు శుక్రవారం తెలిపారు. మండలంలో ఉన్న 27 ఆశ్రమ, గురుకుల హాస్టల్స్‌లో స్ప్రేయింగ్ ప్రక్రియ నిర్వహిస్తామని చెప్పారు. పాఠశాలల ప్రారంభానికి ఒకరోజు ముందే ఈ కార్యక్రమం పూర్తిచేస్తామన్నారు.

జీపుజాతాను జయప్రదం చేయాలి

మక్కువ, మే 30 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతాల్లో నిరుద్యోగుల ఉపాధి కోసం జరుగుతున్న పోరాటాల్లో భాగంగా ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించనున్న జీపుజాతాను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఎర్రసామంతవలసలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆదివాసీలకు ప్రత్యేక డీఎస్సీని ప్రకటించాలని డిమాండ్ చేశారు. గిరిజన సంఘం నాయకులు సీదరపు సూరయ్య, జి.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రెమ్యునరేషన్ పెంచాలి

పాలకొండ, మే 30(ఆంధ్రజ్యోతి): డిగ్రీ పరీక్ష పత్రాలు స్పాట్ వేల్యూయేషన్ చేసే సీఈలు, ఏఈలు శుక్రవారం తమ విధులు బహిష్కరించి పాలకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో నిరసన చేపట్టారు. కనీసం ఇంటర్మీడియట్ వారికి ఇచ్చిన విధంగానైనా టీఏ, డీఏ రెమ్యూనిరేషన్ లేదన్నారు. గత పది సంవత్సరాలుగా ఎన్నోసార్లు విశ్వ విద్యాలయ పెద్దలకు తెలిపినా స్పందన లేదన్నారు. యూనివర్శిటీ పెద్దల నుంచి రెమ్యూనరేషన్ పెంచుతున్నట్టు ఆదేశాలు వచ్చే వరకు పెన్‌డౌన్ కార్యక్రమం ఉంటుందన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

భామిని, మే 30 (ఆంధ్రజ్యో తి): యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ పీవో శాంతిభవానీ అన్నారు. శుక్రవారం స్థానిక రెవెన్యూ కార్యాలయం ప్రాంగణంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, అధికారులు యోగాసనాలు వేశారు. ● కురుపాం: కురుపాంలో ఎంపీడీవో జె.ఉమామహేశ్వరి ఆధ్వర్యంలో శుక్రవారం యోగాంధ్ర నిర్వహించారు. ● గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలో యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీవో సాల్మన్‌రాజ్, తహసీల్దార్ శేఖరం, అధికారులు పాల్గొన్నారు. ● వీరఘట్టం: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో యోగా శిక్షణ నిర్వహించారు. ఎంపీడీవో బి.వెంకట రమణ, ఎంఈవో గౌరునాయుడు పాల్గొన్నారు.